PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 178 | విజయవాడ, సోమవారం 30 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 30 January 2023 | Rs

పాక్‌లో ఘోర ప్రమాదం

- బ్రిడ్జిపై నుంచి పడి దగ్ధమైన బస్సు
- 41 మంది మృతి

• లోపలి పేజీలో..•

నేడు అమరవీరుల దినం



మహాత్మా గాంధీని మతోన్మాద గాడ్సే హత్యచేసి నేటికి 75 ఏళ్లు

మన బాలికలు విశ్వ విజేతలు

అండర్-19 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఘనవిజయం

ట్రోఫీతో భారత్ బాలికల విజయదరహాసం

ఫోచెఫ్‌స్ట్రూమ్ : భారత బాలికలు చరిత్ర సృష్టించారు. తొలిసారిగా నిర్వహించిన అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో విజేతలుగా నిలిచారు. దక్షిణాఫ్రికాలో ఈ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్‌పై ఏడు వికెట్లతో ఏకపక్షంగా విజయం సాధించారు. న్యూజిలాండ్ విధించిన 69 పరుగుల లక్ష్యాన్ని ఇంకా ఆరు ఓవర్లు మిగిలి ఉండగానే కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి భారత్ ఛేదించింది. ఓపెనర్లు కెప్టెన్ షెఫాలీ వర్మ (15), శ్వేత షహ్రావత్ (5) త్వరగా పెవిలియన్ చేరుకున్నా.. గొంగడి త్రిష (24), సౌమ్య తివారీ (24) జోడీ జట్టును విజయం వైపు నడిపించింది. మూడో వికెట్‌కు 46 పరుగులు జోడించిన తరువాత జట్టు స్కోరు 66 వద్ద త్రిష అవుటైనా హ్రిషితా బసు (0)తో కలిసి తివారీ జట్టుకు విజయం అందించింది. ఆదివారం మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత్ ఇంగ్లండ్‌ను 17.1 ఓవర్లలో 68 పరుగులకే కట్టడి చేసింది.

ఇంగ్లండ్ జట్టులో రైనా మాక్ డొనాల్డ్ గే (19) టాప్ స్కోరర్‌గా నిలవగా, సోఫీ స్మాలే 11, అలెక్సా 11, నిమా హోలాండ్ 10 పరుగులు చేశారు. మిగిలిన వారు రెండెంకెల స్కోరు కూడా అందుకోలేకపోయారు. భారతజట్టులో నాలుగు ఓవర్లలో ఆరు పరుగులకే రెండు వికెట్లు సాధించిన టిటాస్ సాధు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయింది. అర్చనా దేవి, పర్షవి చోప్రా కూడా రెండేసి వికెట్లు సాధించారు. ఇంగ్లండ్ క్రీడాకారిణి గ్రేస్ స్కారివెన్స్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయింది. విజేతగా నిలిచిన భారత జట్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు.

నేడు ఢిల్లీకి సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. మంగళవారం నాడు కూడా ఆయన ఢిల్లీలోనే పర్యటించనున్నారు. సోమవారం ఉదయం బాపట్ల జిల్లా వినుకొండలో జగనన్న చేదోడు పంపిణీ కార్యక్రమాన్ని సిఎం ప్రారంభిస్తారు.

అనంతరం ఢిల్లీకి బయలుదేరి వెడతారు. రాత్రికి 1-జనపథ్ నివాసంలో ఆయన బసచేయనున్నారు. విశాఖ పట్నంలో జరిగే ఎపి గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సుకు సంబంధించి పలు సన్నాహక కార్యక్రమాల్లో సిఎం పాల్గొంటారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. మంళవారం ఉదయం నుండి సాయంత్రం దాకా ఢిల్లీ లీలా ప్యాలెస్ హోటల్‌లో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. వివిధ దేశాలకు చెందిన పెట్టుబడిదారులతో పాటు, రాయబారులతో కూడా సిఎం సమావేశం కానున్నారు. అదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్లను కూడా ముఖ్యమంత్రి కోరినట్లు చెబుతున్నారు. ఆదివారం సాయంత్రం వరకు అవి ఖరారు కాలేదు. ఒకవేళ ప్రధాని అప్పాయింట్‌మెంట్ దొరికితే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చేయాల్సిన కేటాయింపుల గురించి వినతిపత్రం ఇవ్వడంతో పాటు పలు ఇతర అంశాలను కూడా ప్రస్తావించే అవకాశం ఉందని సమచారం. వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డిని సిబిఐ ప్రశ్నించిన నేపథ్యంలో ముఖ్మమంత్రి ఢిల్లీ పర్యటన జరగనుండటంతో రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

పిఎం కిసాన్‌కు నిబంధనాలు

లక్షలాది మంది దూరం • ఎపిలో రిజిస్టరైన రైతులు 60 లక్షలు

- మునుపటి కిస్తు పడని రైతులు 33 లక్షలు
- ఇ-కెవైసికి ముగిసిన గడువు • ఇంకా 30 శాతం పెండింగ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం కిసాన్) పథకానికి కేంద్రం విధించిన నిబంధనలు రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులను లబ్ధికి దూరం చేస్తున్నాయి. ఇంతకుముందు స్కీంకు అనర్హులంటూ పెట్టిన షరతులకు తోడు ఇ-కెవైసి వంటి వాటిని అదనంగా జోడించడంతో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు ఏరివేతకు గురవుతున్నారు. పథకానికి నమోదు చేసుకున్న రైతుల్లో 33 లక్షల మందికి ఇంకా కిందటి కిస్తు పడలేదు. అంతకుముందు లబ్ధిదారులతో పోల్చుకుంటే 19 లక్షల మందికి కోత పడింది. కాగా ఇ-కెవైసి పూర్తి కాలేదన్న పేరిట డిసెంబర్-మార్చి కిస్తును రైతుల బ్యాంక్ అకౌంట్లలో కేంద్రం జమ చేయలేదు. త్వరలో కేంద్ర బడ్జెట్ వస్తుండగా గడుస్తున్న ఆర్థిక సంవత్సరంలో ఇవ్వాల్సిన మూడవ కిస్తు జమ పడకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ఇ-కెవైసి గడువును పలుమార్లు పెంచుతూ పోగా శనివారం (జనవరి 28)తో ప్రస్తుత తుది గడువు ముగిసింది. రిజిస్టరైన లబ్ధిదారుల్లో 70 శాతానికే ఇ-కెవైసి పూర్తి చేసినట్లు చెబుతున్నారు. ఇంకా 30 శాతం లబ్ధిదారుల ఇ-కెవైసి పెండింగ్‌లో ఉందని సమాచారం.

45 శాతమే!

గత సార్వత్రిక ఎన్నికలకు ముంగిట మోడీ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అంటూ పిఎం కిసాన్‌ను ప్రారంభించింది. ఏడాదిలో మూడు విడతల్లో రూ.2 వేలు చొప్పున రైతుల అకౌంట్లలో నేరుగా నగదు బదిలీ చేసే పథకమిది. సంవత్సరంలో మూడు విడతలను ఒక్కోదాన్ని నాలుగు మాసాల కింద వర్గీకరించారు. ఏప్రిల్-జులై, ఆగస్టు-నవంబర్, డిసెంబర్-మార్చి. కాగా కేంద్రం విధిస్తున్న షరతులు లక్షలాది మంది రైతులను స్కీంకు దూరం చేస్తున్నాయి. సొంత భూమి యజమానుల కుటుంబానికి మూడు విడతల్లో కేంద్రం ఏడాదికి ఇచ్చేది రూ.6 వేలు. నెలకు రూ.500 పడుతుంది. కుటుంబంలో 5 గురు సభ్యులుంటే ఒక్కొక్కరికి పడది రూ.వంద. రోజుకు రూ.మూడున్నర లోపు. ఆ స్వల్ప సాయానికీ కేంద్రం రోజుకో షరతు పెడుతోంది. ఎపిలో 60,77,808 మంది పథకానికి నమోదు చేసుకోగా 2022-23లో తొలి కిస్తు (ఏప్రిల్-జులై) 46,62,768 మందికి జమ పడింది. రెండో కిస్తు (ఆగస్టు-నవంబర్) 27,55,285 మిగతా 2లో

సముద్రంలో అన్నాచెల్లెలు గల్లంతు

- చెల్లి క్షేమం
- అన్న కోసం గాలింపు

ప్రజాశక్తి-సింగరాయకొండ (ప్రకాశం)

ఆదివారం.. ఆపై బంధువులు రావడంతో సరదాగా కలిసి వారితో సముద్రానికి వెళ్లిన అన్నాచెల్లెలు గల్లంతైన ఘటన ఆదివారం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం, పాకల సముద్రతీరంలో జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్‌హమీద్ సిద్ధిక్ అనే వ్యక్తి సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి పంచాయతీలోని పకీరుపాలెం మసీదులో నమాజు చేస్తూ ఉంటారు. గత 18 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటూ నమాజు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉత్తరప్రదేశ్ నుంచి బంధువులు రావడంతో వారితో కలిసి హమీద్ చిన్నారులు అబ్దుల్ హమీద్ సిద్ధి (15), చెల్లెలు అమల్ (14) పాకల సముద్ర తీరానికి వెళ్లారు. సముద్రపు ఒడ్డున ఆడుకుంటుండగా ఒక్కసారిగా వచ్చిన అలల ఉధృతికి ఇద్దరూ గల్లంతయ్యారు. గమనించిన మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు అమల్‌ని రక్షించి, ఆస్పత్రికి తరలించారు. అహ్మద్ సిద్ధి కోసం మత్స్యకారులతో పాటు మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

విశాఖ ఉక్కుపై అఖిలపక్షం

- సిఎంకు వామపక్షాలు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు పరిశ్రమను వ్యూహాత్మకంగా అమ్మకం చేయాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి రెండేళ్లు పూర్తయిందని, ఈ నేపథ్యంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని పది వామపక్ష పార్టీలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కోరాయి. ఈ మేరకు ఆ పార్టీల నాయకులు ముఖ్యమంత్రికి ఆదివారం ఆదివారం సంయుక్తంగా లేఖ రాశారు. కేంద్రప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రెండేళ్లుగా రాష్ట్రంలో పోరాటం సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం కూడా అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రప్రజలు పలుసార్లు కేంద్రప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారని, అయినా కేంద్రప్రభుత్వం పదేపదే పార్లమెంటులో విశాఖస్టీల్‌ప్లాంటును అమ్ముతామని ప్రకటనలు చేస్తోందని పేర్కొన్నారు. పోరాటకమిటీ పిలుపు మేరకు సోమవారం విశాఖ ఉక్కు పరిశ్రమ వద్ద అఖిలపక్ష పార్టీలతో పోరాట కమిటీ భారీ సభను నిర్వహిస్తోందని, దీనికి వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతిస్తున్నాయని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు పోరాడి సాధించుకున్న భారీ కర్మాగారం విశాఖస్టీల్ ప్లాంట్ అని గుర్తుచేశారు. కేంద్రప్రభుతం ఇందులో కేవలం రూ.5వేల కోట్ల పెట్టుబడి పెట్టిందని తెలిపారు. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్ పన్నులు, డివెడెండ్ల ద్వారా రూ.59వేల కోట్లకు పైగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెల్లించిందని వివరించారు. విశాఖనగరం అభివృద్ధి కావడానికి కీలకం కేంద్రప్రభుత్వ రంగ పరిశ్రమలు అని, అందులో విశాఖస్టీల్ ప్లాంట్ ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. 30వేల మంది ప్రత్యక్షంగాను, మరో లక్షమంది పరోక్షంగా స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి జీవిస్తున్నారని వెల్లడించారు. ఇంతటి ప్రాధాన్యతగల ప్లాంట్‌ను దక్షిణ కొరియాకు చెందిన 'పోస్కో' అనే స్టీల్ కంపెనీకి, దేశంలోని అదానీ కంపెనీకి అప్పగించాలని కేంద్రప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం సొంత గనులు సమకూర్చనందున ప్రతిఏటా రూ.2వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని, అయినప్పటికీ 2021-22 సంవత్సరానికి రూ.945కోట్ల లాభాల్లో ఉందని వివరించారు. అయినా కేంద్రప్రభుత్వం సొంత గనులు కేటాయించకుండా ప్లాంట్‌ను బలహీనపరిచే కుట్రలు చేపడుతున్నదని విమర్శించారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి తీరని హాని తలపెట్టడమేనని పేర్కొన్నారు. రాష్ట్రప్రజల అభిప్రాయానికి భిన్నంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం మొండిగా వ్యవహరించడాన్ని ప్రజానీకం పూర్తిగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ పక్షాలన్నీ ప్రైవేటీకరించడానికి మిగతా 2లో

మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ కన్నుమూత

ప్రజాశక్తి - యంత్రాంగం

మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ (70) మృతి చెందారు. కిడ్నీ మార్పిడి అనంతరం కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున ఆస్పత్రిలో కన్నుమూశారు. భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామం ఏలూరు జిల్లా భీమడోలు మండలం పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం గ్రామానికి తరలించారు. ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఆయన స్వగృహం వద్ద ఉంచారు. రాజకీయ నాయకులు, ఆప్తులు నివాళులర్పించారు. అనంతరం ఆయన వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వసంతకుమార్ సతీమణి ఉమాదేవి ఎనిమిది సంవత్సరాల క్రితం మరణించారు. వారికి పిల్లలు లేకపోవడంతో సోదరుడి కుమారుడు అంత్యక్రియలు నిర్వహించారు.

ఒడిషా మంత్రి దారుణ హత్య

- ఎఎస్‌ఐ కాల్పుల్లో నబా కిశోర్ దాస్ మృతి
- ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దిగ్భ్రాంతి • నిందితుడు అరెస్టు

తూటాలకు నేలకొరుగుతున్న మంత్రి కిశోర్‌దాస్‌ను పట్టుకుంటున్న సిబ్బంది

భువనేశ్వర్ : ఒడిస్సా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నబా కిశోర్ దాస్ దారుణ హత్యకు గురయ్యారు. ఆదివారం ఉదయం ఒక ఎఎస్‌ఐ జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఆయన అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంట సభ్యులను ఓదార్చారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఝార్సుగూడ జిల్లా బ్రిజరాజ్ నగర్‌లో ఒక ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు స్థానిక గాంధీచౌక్‌కు మంత్రి కిశోర్‌దాస్ వెళ్లారు. అక్కడ ఆయన కారు దిగుతున్న సమయంలో భద్రత కోసం మోహరింపజేసిన ఎఎస్‌ఐ గోపాల్ దాస్ అతి సమీపం నుంచి నాలుగైదు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో కిశోర్‌దాస్ ఛాతీలోకి తూటాలు దూసుకెళ్లడంతో అక్కడికక్కడే కుప్పకూలారు. ఆయనతో పాటు స్థానిక పోలీసు స్టేషన్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్, ఇంకొక వ్యక్తి గాయపడ్డారు. వెంటనే వారిని ఝార్సుగూడ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కిశోర్ దాస్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను హెలికాప్టర్ ద్వారా భువనేశ్వర్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచినట్లు అపోలో ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు. అంతకుముందు నవీన్ పట్నాయక్ అపోలో ఆసుపత్రికి వెళ్లి మంత్రికి అందుతున్న చికిత్సపై వైద్యులతో సమీక్షించారు. కానీ చికిత్స పొందుతూనే కిశోర్ దాస్ కన్నుమూశారు. ఎఎస్‌ఐ గోపాల్ దాస్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ దారుణానికి కారణాలేమిటనేది ఇంకా తెలియరాలేదు. నిందితుడు ఘటనా ప్రదేశంలోనే ఉండిపోయారని, దీనినిబట్టి వ్యక్తిగత కారణాలతోనే ఈ దాడి జరిగివుండవచ్చు నని ప్రాథమికంగా భావిస్తున్నారు. బిజెడి సీనియర్ నేత అయిన నబా కిశోర్..ఇటీవల మహారాష్ట్రలోని శని శింగనాపూర్ ఆలయానికి రూ.కోటి పైగా విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు విరాళం ఇవ్వడంతో వార్తల్లో వ్యక్తిగా నిలిచారు.

'అనంత'లో అదాని గుబులు

- సోలార్ కోసం లీజు పద్ధతిలో భూముల సేకరణ
- లీజు ఇవ్వకుంటే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా రైతుల్లో అదాని అక్రమాల వ్యవహారం గుబులు రేగుతోంది. ఈ జిల్లాలో ప్రతిపాదించి సోలార్ పార్కుకు భూమిలిస్తే ఏమవుతుందోనన్న ఆందోళన రైతాంగంలో నెలకొంది. గతంలో లాగా భూములను సోలార్ పార్కు కోసం పూర్తి స్థాయిలో సేకరించడం లేదు. లీజు పద్ధతిలో సేకరించేందుకు అనుమతినిచ్చారు. ఏడాదికి ఎకరానికి రూ.30 వేలు లీజు చెల్లించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అయితే ఈ ఉత్తర్వుల్లో లీజు సంస్థ చెల్లించకపోతే ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి భరోసా లేదు. మరోవైపు అదాని సంస్థ పెద్ద ఎత్తున మోసపూరిత విధానాలు అనుసరిస్తోందంటూ వస్తున్న రైతులు చర్చనీయాంశంగా మారాయి. దీంతో సంస్థ సంస్థ లీజు చెల్లించకపోతే పరిస్థితి ఏమవుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తమకు భరోసా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఎంత భూమి?

సోలార్ పార్కు కోసమని లీజు పద్ధతిలో భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం చేపడుతోంది. ఇది వరకే భూములు కేటాయిస్తూ మంత్రివర్గంలోనూ తీర్మానం చేసింది. అనంతపురం జిల్లాలోని నాలుగు మండలాల్లోని డి.హీరేహాల్, కణేకల్, రాయదుర్గం, బొమ్మనహాల్ మండలాల్లోని 13 గ్రామాల్లోని 11831.81 ఎకరాల భూమిని సోలార్ సార్కు కోసం గుర్తించారు. ఇందులో 9817.18 ఎకరాలు పట్టా భూములు, 557.52 ఎకరాలు ప్రభుత్వ భూమి, 1457.14 అసైన్డ్ భూమిని గుర్తించారు. ఇందులో కొన్ని గ్రామాల్లో పూర్తి స్థాయిలో సాగుభూమి మొత్తం అదాని కంపెనీ సోలార్ పార్కు కింద తీసుకుంది. డీ.హీరేహాల్ మండలంలోని సోమలాపురం గ్రామంలో 1006.41 ఎకరాలు, మురిడిలో 1432.4 ఎకరాలు, కడలూరులో 1008.22 ఎకరాలు, దొడగట్ట గ్రామం పరిధిలో 881.17 ఎకరాలు, కడలూరు మిగతా 2లో

దేశానికి బిజెపి ద్రోహం



ప్రైవేటీకరణతో శ్రీలంక, పాకిస్తాన్‌ల గతే

- ప్రభుత్వ రంగ పరిరక్షణకు ప్రజలు కదలాలి
- రెండేళ్ల 'విశాఖ ఉక్కు' పోరాటం సందర్భంగా ప్రజాశక్తితో సిహెచ్ నర్సింగరావు

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశానికి ద్రోహం చేస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్ నర్సింగరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం రెండు సంవత్సరాలు పూర్తిచేసుకుని మూడవ ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో విచ్చలవిడిగా సాగుతున్న ప్రైవేటీకరణను అడ్డుకోకపోతే దేశానికి శ్రీలంక, పాకిస్తాన్‌ల గతే పడుతుందని హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటాన్ని దేశభక్తియుత పోరాటంగా అభివర్ణించారు. ఇంటర్వ్యూ వివరాలు క్లుప్తంగా..

ప్ర: రెండు సంవత్సరాలుగా సాగుతున్న విశాఖ ఉక్కు పోరాటం సాధించినదేమిటి?

జ: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం ప్రైవేట్‌కు అమ్మాలని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక క్యాబినెట్ సబ్‌కమిటి 2021 జనవరి 27న నిర్ణయించింది. పిఎంఒ ఆఫీస్ సలహా మేరకు నీతి ఆయోగ్ ఈ నిర్ణయాన్ని అమలు చెయ్యటానికి ఆనాటి నుండే ఉపక్రమించింది. అప్పటి నుండి ఇప్పటివరకు ఈ నిర్ణయం ఒక్క అంగుళం కూడా ముందుకు వెళ్లలేకపోయిందంటే కార్మికవర్గం చేస్తున్న పోరాటమే కారణం. పోరాట కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు ఐక్యంగా పోరాటం చేస్తుంటే, వారికి విస్తృతంగా ప్రజామద్దతు లభిస్తోంది. అన్ని తరగతులకు చెందిన ప్రజానీకం ఈ పోరాటానికి మద్దతు తెలుపుతున్నారు. ప్రత్యక్షంగా కార్యాచటకు కదులుతున్నారు. ఆంధ్రుల హక్కును కాపాడుకుంటామని నినదిస్తున్నారు. అందుకే దేశంలో నేడు అనేక చోట్ల జరుగుతున్న కార్మిక ఉద్యమాల్లో విశాఖ పోరాటానికి ధీటు మరొకటి లేదని చెప్పవచ్చు. అందుకే ఈ పోరాటానికి దేశవ్యాపిత ప్రాముఖ్యత ఏర్పడింది. పోరాటం ప్రారంభమై జనవరి 30 నాటికి 2 సంవత్సరాలు పూర్తి అవుతుంది. ఇంత సుదీర్ఘంగా పోరాటం జరుగుతున్నా కార్మికవర్గం ఐక్యంగా నిలవడం, వారికి ప్రజా మద్దతు రోజురోజుకి పెరుగుతుండటం విశేషం. బిజెపి మినహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఘనత కూడా ఈ పోరాటానిదే.

ప్ర: రెండుళ్ల పాటు పోరాటాన్ని ఎలా నిర్వహించారు?

జ: ప్రతి రోజు స్టీల్ ప్లాంట్ జాతీయ రహదారి పక్కన ఉన్న కూర్మన్నపాలెం వద్ద ఒక రిలే నిరాహార దీక్షా శిబిరం, విశాఖ నగరం నడిబొడ్డున ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద మరో రిలే నిరాహారదీక్షా శిబిరం కొనసాగుతోంది. రిలే నిరాహార దీక్షలతో పాటు మరో 50 కార్యక్రమాలు పైగా జరిగాయి. . విశాఖ స్టీల్ ప్లాంట్ లోపల, బయట కూడా భారీ కార్యక్రమాలు నిర్వహించాము . బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చాయి. విశాఖ స్టీల్ గేట్ వద్ద జరిగిన సభలో సుమారు 20 వేల మంది కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు. జనసేన స్వతంత్రంగా ఒక భారీ సభ నిర్వహించింది. కేంద్ర, ప్రభుత్వ నిర్ణయాన్ని వీరంతా తీవ్రంగా విమర్శించారు. విశాఖ స్టీల్ అమ్మకాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. అఖిలభారత ట్రేడ్ యూనియన్ నాయకులు, బిఎంఎస్ తో సహా ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యమానికి మద్దతునిచ్చారు. 10 వేల మందితో 10 కిలో మీటర్లు స్టీల్ ప్లాంట్ వద్ద భారీ మానవహారం జయప్రదంగా జరిగింది. విద్యార్థి, యువత 3 సార్లు 5 కే రన్, బీచ్ వాక్ లు వేలాది మందితో నిర్వహించారు. జాతీయ కిసాన్ మిగతా 2లో

నేడు ఉక్కు ప్రజాగర్జన

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరుకు రెండేళ్లు పూర్తికావడంతో సోమవారం 'ఉక్కు ప్రజాగర్జన సభ' నిర్వహించనున్నారు. ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో మధ్యాహ్నం మూడు గంటలకు భారీ ఎత్తున ఈ సభ జరగనుంది. ఈ సభలో బిజెపి మినహా ఇతర రాజకీయ పార్టీల నాయకులు, వివిధ కార్మిక, ప్రజా సంఘాల నేతలు పాల్గొననున్నారు.

బోధనేతర పనులు తొలగించాలి : ఏపిటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలల్లో బోధనకు అడ్డంకులుగా ఉన్న బోధనేతర పనులను తొలగించాలని ఎపిటిఎఫ్ డిమాండ్ చేసింది. సిలబస్ పూర్తిచేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూల్యాంకనం ఆలస్యమవుతుందని అధికారులు ఒత్తిడి చేయడంతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారుల పర్యవేక్షణ సందర్భంలో ఇచ్చే సూచనలు సలహాలు ఎంత అవసరమో పాఠశాలల్లో బోధనకు ఉండే ఇబ్బందులపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం కూడా అంతే ఉందని తెలిపారు. పలుదఫాలుగా ఉపాధ్యాయ సంఘాలు ఈ అంశాలపై ఆందోళన వ్యక్తం చేసినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదని, ఇప్పటికైనా పాఠశాల తనిఖీల్లో గమనించిన అంశాలపై ఉపాధ్యాయ సంఘాలతో సమీక్షించి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అలా కాకుండా ఉపాధ్యాయులను బాధ్యులను చేసి సస్పెన్షన్లు, ఛార్జి మెమోలు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేయడం తగదని తెలిపారు.

సస్పెన్షన్లతో భయాందోళనలకు గురిచేయడం తగదు : టిఎన్‌యుఎస్

పాఠశాలల్లోని లోపాలను సరిచేయడానికి సస్పెన్షన్ పరిష్కారం కాదని తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్‌యుఎస్) మరో ప్రకటనలో తెలిపింది. లోపాలను గుర్తించి పరిష్కారం దిశగా ఆలోచన చేయాలని ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సబ్‌ప్లాన్ అమలులో మోసపూరిత వైఖరి

- వైసిపిపై నాదెండ్ల విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ అమలులో వైసిపి ప్రభుత్వ వైఖరి మోసపూరితంగా ఉందని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. నిధులు దారి మళ్లించింది చాలక అడ్డగోలుగా బుకాయిస్తోందన్నారు. ఆదివారం గుంటూరు నగర అధ్యక్షులు నేరెళ్ల సురేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర రెల్లి సమితి ప్రతినిధులు మనోహర్‌తో భేటీ అయ్యారు. కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు కూడా లేనిపోని నిబంధనలు పెట్టి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని పేర్కొన్నారు. ఏళ్ల తరబడిపోరాటం చేస్తున్నా ఉద్యోగభద్రత దక్కలేదని, సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదని, సబ్‌ప్లాన్ నిధులు తమకు చేరడం లేదని చెప్పారు. రెల్లి కార్మికుల సమస్యలు పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని, త్వరలో ఆయనతో మంగళగిరి కార్యాలయంలో ఓ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయిస్తానని మనోహర్ పేర్కొన్నారు.

విశాఖ ఉక్కుపై అఖిలపక్షం

మొదటి పేజీ తరువాయి

వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకోవడానికి రాష్ట్రప్రభుత్వం అఖిలపక్ష సమావేశం జరిపి చర్చించడం సమంజసమని తెలిపారు. ఈ లేఖపై సిపిఎం(వి శ్రీనివాసరావు), కె రామకృష్ణ(సిపిఐ), వై సాంబశివరావు (సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ), జాస్తి కిషోర్ బాబు (సిపిఐ(ఎంఎల్), కాటం నాగభూషణం(ఎంసిపిఐ(యు), ఎన్ మూర్తి (సిపిఐ(ఎంఎల్)లిబరేషన్), చిట్టిపాటి వెంకటేశ్వర్వర్లు (సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ) బిఎస్ అమర్‌నాథ్ (ఎస్‌యుసిఐ(సి), పివి సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్) జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) సంతకాలు చేశారు.

పిఎం కిసాన్‌కు నిబంధనాలు

మొదటి పేజీ తరువాయి

మందికే ఇప్పటి వరకు జమ పడింది. రిజిస్టరైన వారిలో సుమారు 33 లక్షల మందికి పడలేదు. ముందటి కిస్తు పడ్డ వారిలో 19 లక్షల మందికి కోత పడింది. అంతకుముందు లబ్ధిదారుల్లో 20 లక్షల మంది తగ్గారు.

భరోసా పలచన

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా వ్యవసాయదారులకు రైతు భరోసా పథకాన్ని పిఎం కిసాన్‌తో కలిపి అమలు చేస్తోంది. రెండు పథకాలకూ కలిపి లబ్ధిదారులను రాష్ట్రమే నిర్ణయిస్తోంది. ఏడాదిలో రైతులకు మూడు విడతల్లో మొత్తం రూ.13,500 అందాలి. మేలో ఇచ్చే తొలి కిస్తు రూ.7,500లో రాష్ట్రం 5,500, కేంద్రం 2,000 ఇవ్వాలి. నవంబర్‌లో ఇచ్చే రెండవ కిస్తులో రాష్ట్రం 2 వేలు, కేంద్రం 2 వేలు ఇవ్వాలి. మూడవ కిస్తు 2 వేలనూ కేంద్రమే ఇస్తుంది. అందులో రాష్ట్ర వాటా లేదు. భూమిలేని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ కౌలు రైతులకు రాష్ట్రమే మొత్తం రూ.13,500 ఇస్తోంది. భూమి యజమానులకు రాష్ట్రం ఇచ్చే సాయం పడుతోంది తప్ప కేంద్రం ఇచ్చేది సకాలంలో పడట్లేదు. లక్షలాది మంది రైతులు కేంద్ర సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

రాష్ట్రానికి కేంద్రం తీరని ద్రోహం

బాపట్ల, కృష్ణాలో ప్రత్యేక హోదా సమరయాత్ర 2.0

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని, తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రధాన మంత్రి మోడీ హామీ ఇచ్చి మాట తప్పారని ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు విమర్శించారు. విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి చేపట్టిన 'ప్రత్యేక హోదా సాధన సమరయాత్ర 2.0' ఆదివారం బాపట్ల, కృష్ణా జిల్లాల్లో పర్యటించింది.ఆయా జిల్లాల్లో యాత్రకు ఘన స్వాగతం లభించింది.బాపట్ల పాత బస్టాండ్ వద్ద జరిగిన సభలో చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేసి ఉంటే రాష్ట్రంలోకి ఉన్నత విద్యా సంస్థలు, పరిశ్రమలు వచ్చేవి అని తెలిపారు. యాత్రకు మద్దతు తెలిపిన సిపిఎం రాష్ట్ర నాయకులు డి.రమాదేవి మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా వస్తే విద్యార్థులకు, యువకులకే ఎక్కువ ఉపయోగమన్నారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలేవీ విభజన హామీల గురించి మాట్లాడటం లేదన్నారు. కృష్ణా జిల్లా చల్లపల్లి సెంటర్‌లో జరిగిన సభలో డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు జి.రామన్న, లెనిన్‌బాబు మాట్లాడారు. విభజన హామీలను అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేస్తోందని విమర్శించారు. ప్రత్యేక హోదా ఇస్తేనే రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహాలో రూ.25 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందన్నారు. కేవలం రూ.1050 కోట్లు మాత్రమే ఇచ్చి కేంద్రం చేతులు దులుపుకోవడంతో ఈ రెండు ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పూర్తిస్థాయి నిధులను కేంద్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెవివి ప్రసాద్ తదితరులు మాట్లాడారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రప్రసాద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న, అశోక్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర అధ్యక్షులు గనిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

లఖింపూర్ ఖేరీలో ఘోరం

- ఆరుకు చేరిన మృతులు

ఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ప్రమాద మృతుల సంఖ్య ఆదివారం నాటికి ఆరుకు చేరింది. లఖింపూర్ ఖేరీలోని గోలా బెహ్రైచ్ జాతీయ రహదారిపై ఓ స్కూటీని కారు ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి కారులో స్కూటీ ఇరుక్కుపోయింది. దీంతో రెండు వాహనాలనూ వేరుచేయడానికి పాదచారులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో వేగంగా దూసుకొచ్చిన ఓ ట్రక్కు వారిని ఢీకొట్టింది. ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన 17 ఏళ్ల బాలుడు రోహిత్ కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. మృతుల్లో ముగ్గురు బాలురు ఉండటం గమనార్హం. శనివారం సంఘటనా స్థలంలో మృతి చెందిన వారిని కరణ్ కుమార్ (14), రిజ్వాన్ (16), కరుణేష్ వర్మ (35), వీరేంద్రకుమార్ వర్మ (50), పరాస్ (85)గా గుర్తించారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నిత్యావసర ధరలు తగ్గిస్తాం

- యువగళంలో నారా లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన యాత్ర మూడో రోజు శాంతిపురం మండలం బాలాజీ కల్యాణమండపం నుంచి కుప్పం నియోజకవర్గంలోని జల్దిగానిపల్లి వరకూ సాగింది. మొత్తం 11 కిలోమీటర్ల మేర యాత్ర సాగింది. యాత్రలో మహిళలు, రైతులను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో జగన్ అధికారంలోకి వచ్చారన్నారు. అమ్మఒడి కేవలం పది శాతం మందికే ఇచ్చారని, మిగిలిన 90శాతం మందికి ఈ పథకం అందకుండా చేశారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో మహిళలపై దాడులు అధికమయ్యాయని, ఈ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదని, మహిళలకు రక్షణ కల్పిస్తామని దిశ చట్టం తీసుకొని వచ్చి ఇరవై ఒక్క రోజుల్లో అఘాయిత్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. దిశ బిల్లు మాత్రమే తీసుకొని వచ్చారని, అది అమలు కాలేదన్నారు. మహిళల రక్షణకు చట్టాలు తీసుకురావడం ముఖ్యం కాదని అమలు పరిచే సత్తా ఉండాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మంచినీరు ఇచ్చే పరిస్థితుల్లో కూడా లేదని విమర్శించారు. ప్రజల దాహార్తిని తీర్చే ఎన్‌టిఆర్ సుజల పథకానికి మంగళం పాడారన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో అందించిన విధంగా పాడి రైతులకు అన్నిరకాల సబ్సిడీలు పరికరాలు అందించి పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గత పాలనలో ఎపిని రైతు రాజ్యం అనేవారని, నేడు ఎపిని రైతేలేని రాజ్యంగా జగన్‌రెడ్డి మార్చేస్తున్నారని విమర్శించారు. జగన్ అధికారంలోకి రాగానే వ్యవసాయ సబ్సిడీలు ఎగ్గొట్టారని ఆరోపించారు. రైతులు క్రాప్ హాలీడే ప్రకటించే పరిస్థితిని జగన్ తీసుకొచ్చారని పేర్కొన్నారు. మోటార్లకు మీటర్లు పెడుతూ రైతులకు ఉరితాళ్లు బిగిస్తున్నారని మండిపడ్డారు. గతంలో టిడిపి అందించిన ప్రతిపథకాలను మళ్లీ తీసుకొస్తామన్నారు. సోమవారం జల్దిగానిపల్లె నుంచి యాత్ర ప్రారంభమై పలమనేరు నియోజకవర్గం వి కోటకు చేరుకోనుంది.

మహిళలతో మాట్లాడుతున్న నారా లోకేష్

వైద్యానికి స్పందిస్తున్నారు : ఎన్‌టిఆర్

- తారకరత్నకు మెరుగైన వైద్యం : కర్ణాటక మంత్రి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తారకరత్నకు మెరుగైన వైద్యం అందుతుందని, వైద్యానికి ఆయన స్పందిస్తున్నారని జూనియర్ ఎన్‌టిఆర్ అన్నారు. నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభం రోజున నందమూరి తారకరత్న గుండెపోటుకు గురైన విషయం తెలిసిందే. ఆయనకు కుప్పం పిఇఎస్ మెడికల్ కాలేజీలో చికిత్స అందించారు. ఆరోగ్యం విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని నారాయణ హదయాలయ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం సోదరుడు కళ్యాణ్ రామ్, నారా బ్రాహ్మణితో కలిసి ఆస్పత్రి వెళ్లారు. వైద్యులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరు, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తారకరత్న పోరాడుతున్నారని తెలిపారు. ఆత్మబలంతోపాటు ఆయనకు అభిమానులు, తాత గారి ఆశీర్వాదం ఉందన్నారు. తారకరత్న త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. అందరి ప్రార్థనలతో ఆయన ఆరోగ్యంగా బయటకు వస్తారని అశిస్తున్నామని అన్నారు. ఐసియులోకి వెళ్లి తారకరత్నను పలకరించే ప్రయత్నం చేశానని, ఆయన వైద్యానికి స్పందిస్తున్నారని వైద్యులు చెప్పారన్నారు. తారకరత్న క్రమంగా కోలుకుంటున్నారని సినీ నటుడు మంచు మనోజ్ అన్నారు. నారాయణ హృదయాలయ ఆసుపత్రికి మనోజ్ వెళ్లారు. తారకరత్న ఫైటర్ అని, పూర్తిగా కోలుకొని త్వరలో బయటకు వస్తారని ఆకాక్షించారు

ఆసుపత్రిలో తారకరత్న ఆరోగ్యంపై ఆరా తీస్తున్న జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్

తారకరత్న ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం: కర్ణాటక వైద్య మంత్రి సుధాకర్

తారకరత్న ఆరోగ్య విషయంలో కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నారని మంత్రి సుధాకర్ తెలిపారు. స్థానికంగా ఉన్న నిమ్హాన్స్ నుంచి బ్రెయిన్‌కు సంబంధించిన ప్రత్యేక వైద్యులను పిలిపించామని చెప్పారు. ఎంతవరకు బ్రెయిన్ డ్యామేజ్ అయ్యిందన్న దానిపైన కూడా చికిత్స కొనసాగుతోందన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహకారం అందిస్తున్నామని వివరించారు. తారకరత్న చికిత్సకు స్పందిస్తున్నారని అన్నారు. నిన్నటితో పోలిస్తే ఇవాళ కొంత పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా వేమన సాహిత్య సదస్సులు : సాహితీ స్రవంతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పోరేషన్

వేమన సాహిత్యంపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సాహిత్య గోష్టులు నిర్వహించనున్నట్లు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. కర్నూలులోని కార్మిక కర్షక భవన్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో సాహితీ స్రవంతి నగర అధ్యక్షులు అయ్యన్న అధ్యక్షతన జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. మోహన్ మాట్లాడుతూ వేమన సాంఘిక, తాత్విక సాహిత్యం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతుందని అన్నారు. వేమన అంతరాలు, అసమానతలు లేని సమాజాన్ని కోరుకున్నారని అన్నారు. ఏ కులమైనా, ఏ మతమైనా, ఏ భాష మాట్లాడినా మానవులందురూ సోదరులేనని, వారిలో శ్రమించే కష్టజీవులే ఉత్తములని వేమన సాహిత్యం ద్వారా విధితమౌతుందని తెలిపారు.

బోయ, వాల్మీకుల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తా: ఐ శామ్యూల్

ప్రజాశక్తి- వెల్దుర్తి

బోయ, వాల్మీకులు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పర్యటించి వారి సమస్యలు తెలుసుకుని ప్రభుతానికి నివేదిస్తామని ఏక సభ్య కమిషన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఐ.శామ్యూల్ ఆనంద్ కుమార్ తెలిపారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం సిద్ధనగుట్ట గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు.

'అనంత'లో అదాని గుబులు

మొదటి పేజీ తరువాయి

గ్రామంలో 1309.88 ఎకరాలు, పులకుర్తి గ్రామంలో 1022 ఎకరాలు మొత్తం ఈ మండలం పరిధిలో 6660.08 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. కనేకల్ మండలం పరిధిలోని హులికేరి గ్రామం పరిధిలో 691.36 ఎకరాలు, జక్కలవడికి గ్రామం పరిధిలో 932.14 ఎకరాలు, యర్రగుంట గ్రామంలో 1087.37 ఎకరాలు మొత్తం 2711.37 ఎకరాలు సేకరిస్తున్నారు. రాయదుర్గం మండలం పరిధిలో గ్రామదట్ల గ్రామం పరిధిలో 1117.03 ఎకరాలు సేకరిస్తున్నారు. బొమ్మనహల్ మండలం పరిధిలో నేమకల్లు గ్రామంలో 575 ఎకరాలు, ఉంతకల్లు గ్రామంలో 343.18 ఎకరాలు, ఇలంజి గ్రామంలో 425.15 ఎకరాలు మొత్తం బొమ్మనహల్ మండలంలో 1343.33 ఎకరాలు మొత్తంగా కలిపి 11831.81 ఎకరాలు సేకరించనున్నారు.

భరోసా ఇస్తేనే : బోయన్న సాయన్న, ఇలంజీ గ్రామం, బొమ్మనహల్ మండలం

ఆదాని కంపెనీకి భూములివ్వాలని కోరారు. అయితే ఇప్పటి వరకు ఒప్పందాలు జరగలేదు. ఇప్పుడేమో ఆ సంస్థపై పెద్దఎత్తున వార్తా కథనాలు వస్తున్నాయి. కొంత అయోమయంలోనూ ఉంది. ప్రభుత్వం వైపు నుంచి ఏదైనా భరోసానిస్తే తాము ఆలోచిస్తాం. లేకపోతే ఇవ్వడం సాధ్యమవదు.

ప్రభుత్వ హామీ ఉండాలి.. వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి

లీజుకు ఇవ్వాలన్నది ప్రభుత్వ నిర్ణయం కాబట్టే, నిర్దేశించిన మొత్తానికి ప్రభుత్వమే హామీ ఉండాలి. గతంలోనూ ఉమ్మడి జిల్లాలో లేపాక్షి నాలెడ్జి హబ్ పేరుతో 8484 ఎకరాల భూములు ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టారు. భూములు తీసుకున్న వారు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. రైతులకు భూములుపోయాయి. ఉపాధి రాలేదు. ఇప్పుడు ఆదానికి ఏకంగా పరిహారం కూడా లేకుండానే లీజు పద్ధతిలో భూమలు కట్టబెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవి

వ్యవస్థీకృత లోపాలకు గురువులను బలిచేయొద్దు

- ప్రవీణ్ ప్రకాష్ వైఖరిపై ఎమ్మెల్సీ ఐవి

ప్రజాశక్తి-మండపేట(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

వ్యవస్థీకృత లోపాలకు ఉపాధ్యాయులను బలిచేయొద్దని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారి ప్రవీణ్‌ప్రకాష్ వైఖరిని ఉద్దేశించి ఆయన పైవ్యాఖ్యలు చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలలను ప్రవీణ్ ప్రకాష్ సందర్శించడం అభినందనీయమన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు అర్థం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. కాని ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడమే ధ్యేయంగా ఈ పర్యటనలు సాగడం తగదన్నారు. ఆయన దష్టికి వచ్చిన అంశాలపై పలు సలహాలు, సూచనలు ఇవ్వాలని, తీవ్రమైన పని వైఫల్యం ఉంటే చర్యలు తీసుకోవడంలో తప్పులేదన్నారు. ప్రతి చిన్న విషయానికీ ఉపాధ్యాయులను బలిచేయం ఏమిటని ప్రశ్నించారు. గతంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టరుగా పనిచేసిన సమయంలోనూ ఆయనపై ఇదే తరహాలో విమర్శలు వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. అలాగే పిఆర్‌సి, అరియర్స్ బకాయిలు ఉద్యోగ విరమణ అనంతరం చెల్లిస్తామనడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ షేక్‌సాబ్జీ, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జి స్థానంలో బ్రిడ్జి కమ్ బ్యారేజ్

కేంద్ర మంత్రులకు సోము వీర్రాజు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాయలసీమ ప్రాంత ప్రజల నుంచి వస్తున్న అభ్యర్థనలు, వెనుకబడిన ప్రాంత ప్రయోజనాల దృష్ట్యా కేబుల్ బ్రిడ్జి స్థానంలో బ్రిడ్జి కమ్ బ్యారేజి ఏర్పాటుపై త్వరలోనే కేంద్ర మంత్రులను కలుస్తానని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, నితిన్‌గడ్కరీలకు లేఖలు రాసినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం పేర్కొంది.

దీక్షలో కూర్చున్న కార్పొరేటర్ బొండా జగన్నాధం తదితరులు

'ఉక్కు' పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 717వ రోజుకు చేరుకున్నాయి. టిడిపి రాష్ట్ర కార్యదర్శి, జివిఎంసి 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాధం (జగన్) తన భార్య లక్ష్మి సహా అనుచరులతో దీక్షా శిబిరానికి తరలివచ్చి పోరాటంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాణ త్యాగాలతో ఏర్పడ్డ ఉక్కు కర్మాగారాన్ని ప్రాణాలర్పించైనా కాపాడుకుంటామన్నారు. రెండేళ్లుగా ఉద్యమం కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. విశాఖ ఉక్కును అమ్మేయాలన్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సరిగా పట్టించుకోకపోవడం వల్లే స్టీల్‌ప్లాంట్‌పై మోడీ సర్కారు దుందుడుకుగా ముందుకు వెళ్తోందని ఆరోపించారు. దీక్షలకు మద్దతు తెలిపిన వారిలో జివిఎంసి కార్పొరేటర్లు పీలా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, రౌతు శ్రీనివాస్, మొల్లి ముత్యాల నాయుడు ఉన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నేతలు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, రామస్వామి, అయోధ్యరామ్ పాల్గొన్నారు.

రాష్ట్ర సమస్యలపై చర్చించండి

టిడిపి పార్లమెంటరీ సమావేశంలో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై పార్లమెంటులో చర్చించాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆ పార్టీ ఎంపిలకు చెప్పారు. చంద్రబాబు అధ్యక్షతన టిడిపి పార్లమెంటరీ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. మంగళవారం నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన రాష్ట్ర సమస్యలపై చంద్రబాబుతో ఎంపిలు చర్చించారు. రాష్ట్ర విభజన సమస్యలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 1, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి వంటి అంశాలపై మాట్లాడాలని ఎంపిలకు చంద్రబాబు సూచించారు. చంద్రబాబు నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీ ఎంపిలు కేశినేని నాని, గల్లా జయదేవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడుతోపాటు కంభంపాటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న టిడిపి ఎంపి కనకమేడల రవీంద్రను సమావేశానికి ముందు చంద్రబాబు ఆ పార్టీ ఎంపిలతో కలిసి పరామర్శించారు.

దేశానికి బిజెపి ద్రోహం

మొదటి పేజీ తరువాయి

మోర్చా నాయకులు విశాఖ బీచ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో అశోక్ ధావ్‌లే, రాజేష్ తికాయత్ తో సహా పలువురు పాల్గొని విశాఖ స్టీల్ పోరాటానికి మద్దతు నిచ్చారు. నిరంతరంగా ఈ పోరాటాలు సాగటానికి పర్మినెంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, అధికారుల తో "విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ" ఏర్పాటు కావడమే ప్రధాన కారణం. "విశాఖ ఉక్కును అమ్మనివ్వం" అనే ఏకైక నినాదంతో ఈ ఉద్యమం నేటికీ కొనసాగుతున్నది.ఐక్య ఉద్యమాలతోనే ప్రభుత్వ విధానాలను అడ్డుకోగలమని స్టీల్ కార్మికులు రుజువు చేశారు.

ప్ర: ప్రజలు ఇంతగా స్పందించడానికి కారణం ఏమిటి?

జ : తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న భారీ పరిశ్రమ ఇది. "విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు" నినాదంతో 1966 నవంబర్‌లో 32 మంది ప్రాణాలు త్యాగం చేశారు. వారి ప్రాణ త్యాగంతోనే ఈ పరిశ్రమ ఏర్పాటైంది. విశాఖ జిల్లాలోని పెదగంట్యాడ ప్రాంతంలో 68 గ్రామాల్లో రైతులు 22 వేల ఎకరాలు అతిచౌకగా విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇచ్చారు. 16 వేల మంది నిర్వాసితుల్లో నేటికి 8 వేల మందికి ఉపాధి కూడా రాలేదు. ఆనాడు కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరించినా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచేలా పోరాటం సాగింది. 1978 జనతాపార్టీ హయాంలో వెయ్యి కోట్ల కేంద్ర బడ్జెట్ నుంచి విడుదల చెయ్యటంతో విశాఖ స్టీల్ నిర్మాణం వేగంగా సాగింది. కేంద్ర ప్రభుత్వం నిధులు పూర్తిగా సమకూర్చకపోయినా అప్పులతో 3.2 మిలియన్ టన్నుల సామర్ధ్యం గల స్టీల్ ప్లాంట్‌ను 1990 లో విపి సింగ్ జాతికి అంకితం చేశారు. ఆ నాటి నుంచి నిధులు ఒక్క రూపాయి కూడా కేంద్ర ప్రభుత్వం సమకూర్చకపోయినా సొంత లాభాల తోనే విశాఖ స్టీల్ రూ.12 వేల కోట్లు అదనంగా ఖర్చు పెట్టి నేడు 7.3 టన్నుల సామర్థ్యానికి ఎదిగింది. 2021-2022 వార్షిక టర్నోవర్ రూ.20 వేల కోట్లు సాధించింది. ఇదే సంవత్సరం నికర లాభం రూ.945 కోట్లు ఆంధ్ర రాష్ట్ర పరిశ్రమలకే విశాఖ స్టీల్ మణిహారం. ఈ పరిశ్రమ ప్రతిదశలోనూ ప్రజల, కార్మికుల త్యాగాలు ఉన్నాయి. ఇటువంటి భారీ పరిశ్రమను విదేశీ పోస్కో కంపెనీ కి కారు చౌకగా కట్టబెట్టాలనుకోవడం దేశద్రోహం.

ప్ర : ప్లాంటు పరిరక్షణకు మార్గాలున్నాయా?

జ: విశాఖ స్టీల్‌ను రక్షించుకోవటానికి సిఐటియు 3 ముఖ్య పరిష్కారాలను సూచిస్తోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ఏకైక ముఖ్య సమస్య సొంత గనులు లేకపోవడం. దీని వల్ల ప్రతి సంవత్సరం సుమారు రెండు వేల కోట్లు అదనంగా విశాఖ స్టీల్ ఖర్చు చేయవల్సి వస్తోంది. దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ, ప్రైవేట్ స్టీల్ ప్లాంట్లకు సొంత గనులున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు ఎందుకివ్వరు ? విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బలహీన పర్చాలనే దురుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నేటికి ముఖ్యంగా ఇనుప గనులు కేటాయించడలేదు. తక్షణమే సొంతగనిని మంజూరు చేయాలి. రెండవది స్టీల్ ప్లాంట్ కున్న రుణాలు సుమారు రూ.30 వేల కోట్లు రద్దుచెయ్యడం. విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.58 వేల కోట్లు పన్నులు, డివిడెండ్ల పేరుతో చెల్లించింది. విశాఖ స్టీల్ ప్రైవేటీకరించకుండా ప్రభుత్వ రంగంలోనే నడిపితే ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి వేల కోట్లు పన్నుల రూపంలోనే వస్తాయి. అప్పులు ఎగ్గొట్టిన బడా పెట్టుబడిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లకు పైగా రుణమాఫీ చేసింది. అదే విధంగా స్టీల్ ప్లాంటు అప్పులను మాఫీ చేయాలి. మూడవది ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడం.కంద్ర ప్రభుత్వం కావాలని స్టీల్ ధరలు బాగా ఉన్న సమయంతో సహా విశాఖ స్టీల్ ఉత్పత్తిని భారీగా తగ్గించింది. స్టీల్ ప్లాంట్‌లో కీలకమైన బ్లాస్ట్ ఫర్నేష్ - 3 సంవత్సరం నుంచి మూసివేసింది. వివిధ విభాగాల్లో ఉత్పత్తిని భారీగా తగ్గించింది. విశాఖ స్టీల్ ప్లాంట్ నూరు శాతం సామర్థ్యంతో నడపాలి.

ప్ర: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరి ఎలా ఉంది.?

జ: రెండేళ్లుగా పెద్ద ఎత్తున పోరాటం సాగుతున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించడం లేదు. పైగా స్వాతంత్ర్యానంతరం దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా అమ్మేస్తాం. లేదా మూసేస్తాం అనే తప్పుడు వైఖరి తీసుకుంది. రైళ్ళు, విద్యుత్, పెట్రోలియం తో సహా అనే కీలక రంగాలు రకరకాల పద్ధతుల్లో అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేస్తున్నది. బిజెపి ప్రభుత్వం విదేశీ బహుళజాతి సంస్థలకు అమ్ముడుపోయి దేశంలోని భూములు, గనులు, సముద్ర తీరం, భారీ పరిశ్రమలతో సహా దేశ సంపదను విదేశాలకు కట్టబెడుతోంది. ఇది భారతదేశానికి తీవ్ర ద్రోహం చేయడమే. ఈ రంగాలు ప్రైవేటు అయితే ప్రజలపై విపరీతమైన భారాలు పడతాయి. విద్యుత్, రైల్వే చార్జీలు అనేక రెట్లు పెరుగుతాయి. శ్రీలంక, పాకిస్థాన్ ల గతి భారతదేశానికి దాపురించకతప్పదు. అందుకే కార్మికులు పెద్ద ఎత్తున కేంద్ర నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నారు. మహారాష్ట్రలో విద్యుత్ పంపిణి ప్రైవేట్‌కు వ్యతిరేకంగా జనవరి 4న ఆ రాష్ట్రంలో జరిగిన భారీ సమ్మె దీనికి ఉదాహరణ. భారత దేశం నేటికి వ్యవసాయ దేశం వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్లకి కట్టబెట్టాలని బిజెపి కుట్ర చేస్తున్నది. ఈ కుట్రకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే మార్గం. అందుకే విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేక పోరాటం. . బిజెపి విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటానికి అన్ని తరగతులు, రంగాల ప్రజల విస్తృత మద్దతు కోరుతున్నాం. ఆ తరహా విశాల మద్దతుతో జరిగే ఐక్య పోరాటాలతోనే బిజెపి విధానాలను తిప్పికొట్టగలం.

టిడిపి ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడికి తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

బచ్చుల అర్జునుడు

తెలుగుదేశం పార్టీ శాసన మండలి సభ్యులు బచ్చుల అర్జునుడు ఆదివారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో నివాసం ఉంటున్న ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు విజయవాడలోని రమేష్ ఆస్పత్రికి తరలించారు. ఆయనకు స్టంట్ వేసినట్లు వైద్యులు తెలిపారు. బిపి ఎక్కువగా ఉన్నందున పరిస్థితి విషమంగానే ఉందన్నారు. ఎప్పటికప్పుడు అర్జునుడి ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు. విషయం తెలుసుకున్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు బచ్చుల అర్జునుడి కుటుంబ సభ్యులకు, వైద్యులకు ఫోన్ చేశారు. అర్జునుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. డాక్టర్లను అడిగి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పలువురు టిడిపి నేతలు ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు.

ధనికులకే పెద్దపీట

- రమణ దీక్షితులు ట్వీట్

Ramana Dikshitulu
@DrDikshitulu
Agamas are totally ignored or altered by temple officials according to their own plans and fancies. Most importance is given to the rich devotees and self centered vips. Very pathetic in AP.

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయ అధికారులపై రమణ దీక్షితులు ఆదివారం సంచలన ట్వీట్ చేశారు. తిరుమలలో ఆగమ శాస్త్రాన్ని పాటించడంలేదంటూ ఆరోపించారు. ఆలయ అధికారులు వారి అభిరుచి మేరకు ఆగమ శాస్త్రాన్ని పూర్తిగా మార్చివేస్తున్నారని విమర్శించారు. ధనిక భక్తులకు, విఐపిలకే అధికారులు ప్రాధాన్యత కల్పిస్తున్నారని, వారి సేవలో తరిస్తున్నారని అన్నారు. ఎపిలో ఆలయాల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మూడు గంటల తర్వాత ట్వీట్‌ను రమణ దీక్షితులు తొలగించడం గమనార్హం.

టిటిడిలో ఇంధన సామర్థ్య కార్యక్రమాలు : ఇఒ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి)లో ఇంధన సామర్థ్య కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఇఒ ధర్మారెడ్డి తెలిపారు. టిటిడి నీటి పంపింగ్ స్టేషన్లలో ఎనర్జీ ఎఫిషియన్సీ ప్రాజెక్టుపై ఎపి రాష్ట్ర ఇంధన పరిరక్షణ సమితి (ఎపిఎస్ఇసిఎం), ఇంధన శాఖ, ఎపి ఇంధన సామర్థ్య అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిసిఇడిసిఒ)తో కలిసి ఆదివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. టిటిడిలో ప్రస్తుతం ఉన్న 118 పంపుసెట్ల స్థానంలో ఇంధన సామర్థ్య పంపుసెట్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని యాత్రికులకు ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను మెరుగుపరుస్తామన్నారు. టిటిడిలో ఉన్న పంపింగ్ స్టేషన్లలో ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ ఎనర్జీ ఆడిట్ (ఐజిఇఎ) నిర్వహించినట్లు ఎపిసిడ్‌కో, ఎపిఎస్ఈసిఎం సీనియర్ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న పంపుసెట్లను ఇంధన సమర్థవంతమైన పంపుసెట్లతో భర్తీ చేసేందుకు సుమారు రూ.3.18 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇది ఏడాదికి రూ.3.17 కోట్ల విలువైన 4.5 ఎంయు విలువైన ఇంధనాన్ని ఆదా చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదనను టిటిడి బోర్డు ఆమోదం కోసం పంపుతామని ఇఒ ధర్మారెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయులపై కక్షసాధింపు మానుకోవాలి

- టిడిపి ఎమ్మెల్యే అనగాని డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలకు దిగుతోందని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఈ చర్యలను మానుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా కనీసం జీతాలు కూడా సరిగా ఇవ్వకుండా వేధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నేడు ఉన్న స్థానం నుంచి అథోస్థానానికి విద్యార్థులను, ఉపాధ్యాయులను దిగజారుస్తోందని తెలిపారు. ఉపాధ్యాయులకు జీతాలు దండగ, పాఠశాలలకు వచ్చి నిద్రపోతున్నారంటూ పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ మాట్లాడటం ఉపాధ్యాయులను అవమానించడమేనని పేర్కొన్నారు. ప్రవీణ్ ప్రకాష్ వారానికి ఒకసారి ఢిల్లీ ఎందుకు వెళ్తున్నారని, ఎవరి డబ్బులతో వెళ్తున్నారని ప్రశ్నించారు. ఢిల్లీలో స్థిర నివాసం ఉంటూ ఆంధ్రప్రదేశ్‌కు గెస్ట్‌లా వచ్చి ఉపాధ్యాయులపై నోరు పారేసుకుంటున్న ప్రవీణ్‌ప్రకాష్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఎందుకు స్పందించడం లేదో చెప్పాలన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన ఉపాధ్యాయులను అవమానిస్తారా అని మండిపడ్డారు. మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం, ముఖ ఆధారిత హాజరు వంటి 22 రకాల యాప్‌లతో విధులు నిర్వహించాలంటూ వేధిస్తున్న ప్రభుత్వం ఎన్నికల విధులు మాత్రం పక్కన పెడుతుందని పేర్కొన్నారు.

మిర్చికి 'నల్ల తామర'

- రెండో ఏడాదీ వెంటాడుతున్న తెగులు
- అధికంగా పురుగుమందుల వినియోగంతో రైతులకు భారీగా పెరిగిన ఖర్చు

పల్నాడు ప్రాంతంలో తామర తెగులు సోకిన మిర్చి, ఇన్‌సెట్‌లో మిర్చి ఆకులను తినేస్తున్న పురుగులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

మిర్చి రైతులను ఈ ఏడాదీ తామర తెగులు వెంటాడుతోంది. దీని నివారణకు అధికంగా పురుగు మందులు వాడాల్సి వస్తోంది. దీంతో, రైతులకు ఖర్చు తడిచిమోపెడవుతోంది. రాష్ట్రంలో ఈ ఏడాది మిర్చి సాగు గణనీయంగా పెరిగింది. గతేడాది 4.58 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది 5.54 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అందులో అత్యధికంగా పల్నాడు జిల్లాలో 1.30 లక్షల ఎకరాలు, కర్నూలు జిల్లాలో 1.11 లక్షల ఎకరాలు, ప్రకాశం, అనంతపురం జిల్లాలో 70 వేల ఎకరాల్లో చొప్పున సాగులో ఉంది. గుంటూరు జిల్లాలో 40 వేలు ఎకరాలు, ఎన్‌టిఆర్ జిల్లాలో 45 వేల ఎకరాలు, నంద్యాల జిల్లాలో 45 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. బాపట్ల జిల్లాలో 29 వేల ఎకరాల్లో సాగులో ఉంది. గతేడాది తామర తెగులు వచ్చి ఎక్కువమంది రైతులు నష్టపోయారు. అయినా, ఇతర పంటలకులేని ధరలు మిర్చికి ఉండడంతో ఈ ఏడాదీ మిర్చి సాగు చేపట్టారు. గత రెండేళ్లుగా తెగుళ్లు మిర్చి పంటను ఎక్కువగా నాశనం చేస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో గత రెండు నెలలుగా నల్ల తామర తెగులు పట్టిపీడిస్తోంది. పంటను కాపాడుకోవడానికి రైతులు అధికంగా పురుగు మందులు వాడుతున్నారు. మిర్చి సాగుకు సహజంగా ఎకరాకు రూ.లక్షకుపై పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అధికంగా పురుగు మందుల వినియోగం వల్ల రైతులకు ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు అదనపు పెట్టుబడి అవుతోంది. కొంతమంది అవగాహనలేక సింథటిక్ పైరిత్రాయిడ్, నత్రజని మందులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ధరలు ఆశాజనకంగా ఉండడంతో పంటను కాపాడుకోగలిగితే ఎంతోకొంత లాభం పొందొచ్చని ఆశిస్తున్నారు. క్వింటాలుకు సగటు ధర రూ.15 వేల వరకూ ఉండడంతో పెట్టుబడి అయినా వస్తుందని ఆశతో ఎక్కువమంది రైతులు ఉన్నారు. తెగుళ్ల నివారణలో వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు రైతులను చైతన్యవంతం చేయలేకపోతున్నారు. తెగుళ్ల నివారణకు ఆకర్షణ పైర్లుగా ఆముదం, బంతి మొక్కలు చేలలో వేసుకోవాలని మాత్రమే సూచిస్తున్నారు. విచక్షణారహితంగా పురుగు మందులు వాడకుండా బంతి, ఆముదం సాగు చేస్తూ పంట మార్పిడి విధానం పాటించాలని అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలి

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ
- అమరావతి బాలోత్సవం ప్రారంభం

సభలో ప్రారంభోపన్యాసం చేస్తున్న చొక్కాపు వెంకట రమణ, వేదికపై లక్ష్మణరావు, చలవాది మల్లికార్జునరావు తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

విద్యార్థులు సామాజిక స్పృహతో వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ అన్నారు. అమరావతి బాలోత్సవం 5వ పిల్లల పండుగ విజయవాడ వన్‌టౌన్ కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ బాలోత్సవంలో తొలుత చొక్కాపు వెంకటరమణ జాతీయ పతాకాన్ని, అమరావతి బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు చలువాది మల్లిఖార్జునరావు బాలోత్సవం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బాలోత్సవం అధ్యక్షులు ఎస్‌పి.రామరాజు అధ్యక్షతన జరిగిన సభలో వెంకటరమణ ప్రారంభోపన్యాసం చేస్తూ.. చదువుతోపాటు సాంస్కృతిక అంశాల్లోనూ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించాలన్నారు. గెలుపుపోటములతో సంబంధం లేకుండా పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి బాలోత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో నేడు ఆటపాటలు కరువయ్యాయని, అమరావతి బాలోత్సవం ద్వారా పిల్లలు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించడం ముదావహమని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బాలోత్సవం బాధ్యులు వాసిరెడ్డి రమేష్ బాబు, కమిటీ గౌరవాధ్యక్షులు చలువాది మల్లిఖార్జునరావు, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో పలు బహుమతులు సాధించిన చెర్రీ అనే ఏడేళ్ల బాలుడు డ్రమ్స్ వాయిస్తూ తన ప్రతిభను ప్రదర్శించారు. మొదటి రోజున వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో వేలాది మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు.

నేడు, రేపు సిటిజన్ ఔట్ రీచ్

- ఇంటింటికీ సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30, 31 తేదీల్లో ప్రభుత్వం సిటిజన్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ (సిఒపి) చేపడుతోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు టీమ్‌లుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో భేటీ కావడం, సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించడం సిటిజన్ ఔట్‌రీచ్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపిడిఓలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించేలా గ్రామ వార్డు సచివాలయాల శాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఇంటింటికీ వెళ్లిన టీమ్‌లు ఆయా కుటుంబాల్లో మహిళలు పొందుతున్న సంక్షేమ పథకాలు, సంవత్సరాల వారీగా వివరాలు తెలపాల్సి ఉంటుంది. లబ్ధిదారుల ఫొటో తీసే సమయంలో విధిగా లొకేషన్ ఆన్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వైఎస్‌ఆర్ ఆసరా, వైఎస్‌ఆర్ చేయూత, వైఎస్‌ఆర్ ఇబిసి నేస్తం, వైఎస్‌ఆర్ కాపు నేస్తం, జగనన్న అమ్మ ఒడి, వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులై ఉండి పథకాలు రాని వారు ఉంటే వారిని గుర్తించి పథకాలు వారికి అందేలా గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు చూడాలని గ్రామ వార్డు సచివాలయాలశాఖ సూచించింది.

పోలీసులు దూషించారని తల్లీకుమారుడు ఆత్మహత్యాయత్నం

- కుమారుడు మృతి
- ఎస్ఐ, ఎఎస్ఐలు సస్పెన్షన్
- ఐజి విచారణ

ప్రజాశక్తి - బనగానపల్లె (నంద్యాల జిల్లా)

మృతదేహంతో బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌ను ముందు ధర్నా చేస్తున్న స్థానికులు

పోలీసుల దూషణతో మనోవేధనకు గురైన నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని చిన్నరాజుపాలెం గ్రామానికి చెందిన కుమ్మరి దస్తగిరి, అతని తల్లి పోలీసు స్టేషన్ ఎదుట అత్మహత్యాయత్నం చేసిన సంఘటనకు సంబంధించి ఎస్ఐ శంకర్ నాయక్, ఎఎస్ఐ లక్ష్మణ్‌ను సస్పెండ్ చేసినట్లు నంద్యాల ఎస్‌పి కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనకు కారకులైన మరో తొమ్మిది మంది పోలీసు సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ ఘటనలో దస్తగిరి మృతి చెందడంపై రాయలసీమ ఐజి సెంథిల్ కుమార్, నంద్యాల జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు. అనంతరం ఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ.. బనగానలపల్లె మండలం చిన్న రాజుపాలెం గ్రామానికి చెందిన గురమ్మ కుటుంబ సభ్యులు అదే గ్రామానికి చెందిన వడ్డే నాగలక్ష్మమ్మకు లక్ష రూపాయలను అప్పుగా ఇచ్చారు. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించకపోవడంతో నాగలక్ష్మమ్మను దూషించారు. దీంతో నాగలక్ష్మమ్మ గురమ్మపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నిమిత్తం శనివారం రాత్రి గురమ్మను, ఆమె కుమారుడు దస్తగిరిని ఎస్ఐ శంకర్ నాయక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ఎస్ఐ వద్దే ఇరువర్గాలు వాదనకు దిగడంతో గట్టిగా మందలించారు. గురమ్మను, దస్తగిరిని తీవ్రంగా దూషించడంతో మనస్థాపానికి గురై స్టేషన్ ఎదుటే పురుగుల మందు తాగారు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ దస్తగిరి మృతి చెందగా, గుర్రమ్మ చికిత్స పొందుతోంది. మృతుడి సోదరుడు నగేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ, ఎఎస్ఐతోపాటు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వ వైద్యశాలలో దస్తగిరి మృతదేహానికి పోస్టుమార్టం చేయకుండా బంధువులు అడ్డుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించేవరకు శవ పరీక్ష జరపనీయమని నిరసనకు దిగారు. మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి వారికి నచ్చజెప్పి శవ పరీక్ష నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోలీస్ స్టేషన్ వద్దకు తెచ్చి ఎస్ఐ, ఎఎస్ఐతో పాటు మరో 9 మందిపై కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీలను ఇచ్చేంతవరకు శవాన్ని తరలించబోమని బైఠాయించారు. మాజీ ఎమ్మెల్యే, ఆళ్లగడ్డ డిఎస్‌పి సుధాకర్‌రెడ్డి, రాయలసీమ ఐజి సెంథిల్ కుమార్, జిల్లా ఎస్‌పి రఘువీర్‌రెడ్డిలతో పలుమార్లు చర్చలు జరిపారు. ఎస్ఐ, ఎఎస్ఐలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ధర్నాను విరమించారు.

కార్పొరేట్ కంపెనీలకు ప్రజల ఆస్తులు తాకట్టు

- కార్మిక కర్షక, వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశ ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టేందుకు మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయంలో ఆదివారం సదస్సు నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు చేశారని విమర్శించారు. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశాన్ని మతోన్మాద దేశంగా మార్చాలని బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. బడ్జెట్‌లో నిధుల కోత విధిస్తున్నారని, ఉపాధి కూలీ రూ.600కు పెంచాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక, రైతు కూలి వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, జిల్లా ఉపాధ్యక్షులు జి. చంద్రశేఖర్, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, ఉపాధ్యక్షులు సురేష్, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

వసంతకుమార్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కెవిపి రామచంద్రరావు, కె.రఘువీరారెడ్డి, అల్లు అరవింద్ తదితరులు

మాజీ మంత్రి వసంత్‌కుమార్‌కు కన్నీటి వీడ్కోలు

- గవర్నర్, సిఎం సంతాపం

ప్రజాశక్తి - ఉంగుటూరు, భీమడోలు, అమరావతి బ్యూరో

మాజీ మంత్రి, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే వట్టి వసంత్‌కుమార్ (70)కు అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. విశాఖలో ఆదివారం తెల్లవారుజామున వట్టి కన్నుమూయడంతో, భౌతికకాయాన్ని ఏలూరు జిల్లా భీమడోలు మండలం పూళ్ల పంచాయతీ పరిధి ఎంఎం పురంలోని ఆయన స్వగృహానికి తరలించారు. వసంత్‌కుమార్ భౌతికకాయానికి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, అంబటి రాంబాబు, పిసిసి మాజీ అధ్యక్షులు కె.రఘువీరారెడ్డి, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, కెవిపి రామచంద్రరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, కాంగ్రెస్, వైసిపి నాయకులు పెద్దసంఖ్యలో నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి దాడిశెట్టి రాజా నివాళులర్పించారు. అంతిమయాత్రలో గ్రామస్తులు, అభిమానులు వందలాదిగా పాల్గొన్నారు. సినీ నిర్మాత అల్లు అరవింద్, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాల మధ్య తమ్ముడి కుమారుడు అంత్యక్రియలు నిర్వహించారు.

గవర్నర్, సిఎం సంతాపం

వసంత్ కుమార్ మతి పట్ల రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. వసంత్‌కుమార్ కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తదితరులు సంతాపం తెలిపారు.

వసంతకుమార్ ప్రస్థానం

ఉంగుటూరు నియోజకవర్గం నుంచి 2004, 2009లో వసంతకుమార్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత రోశయ్య క్యాబినెట్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిగా, కిరణ్ కుమార్‌రెడ్డి క్యాబినెట్‌లో పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి అంశాలపై ఆయనకు మంచి అవగాహన ఉంది. ఈ అంశంపై విశాఖ నగరంలో జరిగిన కొన్ని సదస్సుల్లో పాల్గొని గళం వినిపించారు. 'ఎపికి ప్రత్యేక హోదా - విభజన హామీల అమలు' అనే అంశంపై ఇటీవల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో పాల్గొన్నారు. 2018లో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. అప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటూ విశాఖలో నివసిస్తున్నారు.

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
PUBLIC NOTICE
Finkurve Financial Services LTD. through his facilitated partner **Augmont Gold Tech Pvt. Ltd.** వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: **02.02.2023** వ సమయం **10** గంటలకు **CMS INFO SYSTEMS LTD. Ground Floor, Door No. 4-4-156, Chandhra Mauli Nagar, 6th Length, Guntur - 522 007.** వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
NARSARAOPET BALAJI : LRKTT4I8.
For More Details, Contact: Ramprasad Nandipati, Mob. 9246482477
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
PUBLIC NOTICE
Finkurve Financial Services LTD. through his facilitated partner **Augmont Gold Tech Pvt. Ltd.** వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: **02.02.2023** వ సమయం **10** గంటలకు **Augmont Gold For All, Door No. 26-25-29, 1st Floor, Gnavoluvari Street, Gandhi Nagar, BRTS Junction, Vijayawda - 520003.** వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
VIJAYWADA : LRKXF37Y, VIJA-K7KQ, VIJA-SXKG.
For More Details, Contact: Ramprasad Nandipati, Mob. 9246482477
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

TATA
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
సంప్రదించాల్సిన చిరునామా: 11వ అంతస్తు, టవర్-ఎ, పెనిసులా బిజినెస్ పార్కు, గణపతురావు కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400 013, సంప్రదించాల్సి నం.(022)66069383.

డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్సుమెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్") యొక్క రూల్ 3తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్సుమెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 ("చట్టం") యొక్క సెక్షన్ 13(2) క్రింద.

ఏదైతే, క్రింది సంతకందారు **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్ఎల్)** యొక్క అధీకృత అధికారిగా, చట్టం క్రింద మరియు రూల్స్ యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ తేదీ నాటి వివరణాత్మక డిమాండ్ నోటీసు జారీచేసి, చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద, ఇందు దిగువ జాబితాలోని రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు(అందరు విడివిడిగా లేదా కలిసి "బాధ్యులుగా")/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు దిగువ ఇవ్వబడిన వివరాల ప్రకారం, సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా సదరు డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. సదరు నోటీసుల కాపీలు రిజిస్టర్డు పోస్టు అక్నాలెడ్జిమెంట్ ద్వారా పంపబడినవి మరియు క్రింది సంతకందారు వద్ద అందుబాటులో ఉంటాయి. మరియు సదరు బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు అవసరమనుకొంటే దానిని క్రింది సంతకందారు నుండి ఏదేని పనిదినమున ఆఫీసు పనివేళల్లో స్వీకరించవచ్చును.

పైదానితో సంబంధించి, ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, సదరు బాధ్యులచేత నిర్వహించబడిన ఏవేని రుణ ఒప్పందాలు మరియు ఇతర పత్రాలు/వ్రాతలతో చదువబడుతూ, సదరు నోటీసుల తేదీ నుండి 60 రోజుల్లోగా టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెల్లించవలసిందిగా మరోసారి సదరు బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు ను కాలం (డి)లో దిగువ పేర్కొనబడిన సదరు తేదీల నుండి చెల్లించు వరకు దిగువ వివరించినట్లు తదుపరి వడ్డీతోపాటు వారి సదరు పేర్లకు ఎదురుగా ఇందు దిగువ గుర్తించిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడుచున్నది. రుణంను తిరిగి చెల్లించుటలో హామీగా, దిగువ సెక్యూర్డ్ అసెట్స్‌ను సదరు బాధ్యులుచేత టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు తాకట్టుపెట్టబడినవి.

క్ర. సం.	రుణ ఖాతా నం.	బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధుల పేరు	దిగువ తేదీ నాటికి పూర్తి బకాయి మొత్తాలు (రూ)	డిమాండ్ నోటీసు తేది మరియు ఎన్‌పిఏ తేది
2	9421500	శ్రీ కాలి కృష్ణ గణేష్ తోట, (రుణగ్రహీత) శ్రీమతి మర్రి నిహారిక, (సహ-రుణగ్రహీత)	20.01.2023 నాటికి రూ.17,53,421/- (రూపాయలు పదిహేడు లక్షల యాభై మూడు వేలనాలుగు వందల ఇరువై ఒకటి మాత్రమే)	20.01.2023 & 08-12-2022

సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తులు/తాకట్టుపెట్టిన ఆస్తుల వివరణ: రిజిస్టర్డు సేల్ డీడ్ నం.4388/2015 ఆధారంగా శ్రీ తోట కాలి కృష్ణ గణేష్ పేరున ఉన్న, కృష్ణ జిల్లా, గొల్లపూడి గ్రామపంచాయతి ఏరియా, గొల్లపూడి గ్రామం వద్దగల ఆర్.ఎస్.నం.402/2 లో 389.42చ.గ.ల పూర్తి విస్తీర్ణంనకుగాను, పాత డోర్ నం. 9-41, ఆవరణ డోర్ నం.26-33, గల 25.96చ.గ.ల సూచించని ఉమ్మడి విస్తీర్ణంతోసహా 800చ.అ.ల నిర్మిత ఏరియాతో "శ్రీ సాయి అవెన్యూస్", ఎ-బ్లాక్, రెండవ అంతస్తులో ఫ్లాట్ నం.302గల ఆస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **ఫ్లాట్‌కు సరిహద్దులు: తూర్పు:** ఒపెన్ టు స్కై, **దక్షిణం:** ఒపెన్ టు స్కై, **పడమర:** మెట్లు, లిఫ్టు, ఉమ్మడి కారిడార్, **ఉత్తరం:** ఫ్లాట్ నం.304. **ల్యాండ్‌కు సరిహద్దులు: తూర్పు:** పంచాయత్ బజార్, **దక్షిణం:** పంచాయత్ బజార్, **పడమర:** జి. దుర్గమ్మ ఆస్తి, **ఉత్తరం:** పంచాయత్ బజార్.

పై పేర్కొన్న సదరు డిమాండ్ నోటీసుల తేదీలలో మరింత స్పష్టంగా చూపినట్లుగా సదరు తేదీ నుండి చెల్లించు తేదీ వరకు వెచ్చించిన ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, చార్జీలు మొ॥వాటితో తదుపరి వడ్డీ, అదనపు వడ్డీ రేటుతో చెల్లించవలసిందిగా కోరబడుచున్నది, ఒకవేళ సదరు బాధ్యులు పై చెప్పినట్లు టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెల్లించుటలో విఫలం చెందినట్లైతే, టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ అనునది సదరు బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధుల పూర్తి బాధ్యత పైననే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు వర్తించబడు రూల్స్ క్రింద పై సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తి(లు)పై చర్యలు తీసుకొంటుంది. సదరు బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధులు, టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల ద్వారా పై చెప్పిన సెక్యూర్డ్ అసెట్స్‌ను/స్థిరాస్తులను బదిలీచేయుట నుండి సదరు చట్టం క్రింద నిషేదింపబడినారు. ఎవరైనా వ్యక్తి చట్టం లేదా దాని క్రింద రూపొందించిన నియమాల ను ఉల్లంఘించినట్లైతే చట్టం క్రింద జైలు శిక్ష మరియు/లేదా జరిమానాకు బాధ్యులగుదురు.

తేది: 30.01.2023
ప్రదేశం: ఆం.ప్ర. & తెలంగాణ
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున



'నేనింత పిడికెడు మట్టే కావొచ్చు..
కలమెత్తితే నాకు
ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది..'
- శేషేంద్ర

వలస దుఃఖానికి గొంతునిచ్చిన కవిత్వం

'నేను నన్ను ప్రవాసం చేసిన భాషలో మాట్లాడుతున్నాను'

- అడోనిస్

'దేహమంతా పాదాలతో / నేను నడుస్తున్నాను

నాతో దేశం నడుస్తోంది / దేశం వెంట మరో దేశం

- ఈ అనంత యాత్రకు మొదలెప్పుడో చెప్పలేను'

రెక్కలు తప్ప ఆస్తులు లేని కష్టజీవులు, నిరుపేదలు, పొట్టకూటి కోసం ప్రవాసం వెళ్లడం ఈనాటిది కాదు. ఆది నుండీ ప్రవాసమున్నది. కాలమే ఈ అనంత యాత్రతో ప్రారంభమైంది. మానవజాతి గమనానికే ఇది మూలమైంది. అందుకే కవి ప్రసాదమూర్తి తన దీర్ఘకావ్యాన్ని ఈ ప్రవాస యానంతోనే మొదలుపెడుతున్నాడు. దేహాలను, కుటుంబాలను రెండు చేతులతో పొదివి పట్టుకుని పరుగులు తీస్తున్న వలస కార్మికుల ప్రవాస ప్రయాణంతోనే తన దుఃఖగీతిని ప్రారంభిస్తున్నాడు. 'తరమబడ్డ దేశాలనుండి / తరమబడ్డ జీవితాలనుండి / తిరగబడ్డ జీవితేచ్ఛ / పాదాలు తొడుక్కుని / పాదాలకు దేహాలు తొడుక్కుని / ..... / దేహాలను దేహాలతో పట్టుకుని / పరుగులు తీస్తున్న'... వలస కావ్యం రచిస్తున్నారు.

తెలుగులో కరోనా కాలం గురించి అనేక కవితలొచ్చాయి. ఒక దీర్ఘ కవిత (నందిని సిధారెడ్డి గారిది) కూడా వచ్చింది. ఐతే ప్రసాదమూర్తి ఒక భిన్న స్వరంతో మాట్లాడుతున్నాడు. ఒక భిన్న సన్నివేశాన్ని భిన్న తాత్వికతతో పట్టుకున్నారు. కరోనా లాక్ డౌన్ ప్రకటించినప్పుడు, హఠాత్తుగా కష్టజీవులను నగరాలు ఖాళీ చేయమని తాఖీదు జారీ చేసి బలవంతంగా వాళ్ళను స్వంత ఊర్లకు తరిమేసినప్పుడు, దేశవ్యాప్తంగా ఏర్పడిన పరిస్థితిని గురించి మాట్లాడుతున్నాడు. కాలప్రవాహంలో 'మార్చి 24, 2020' ఒక తారీఖే కావచ్చు కానీ, కోట్లాది శ్రమజీవులను వలస సర్ప పరిష్వంగంలో బంధించి, జీవితం కోసం, ప్రాణం కోసం, ఊపిరి కోసం తల్లడిల్లేటట్టు చేసిన దుర్మార్గమైన రోజు అది. ఎందరెందరో ఊరూ పేరూ లేని అమాయకపు జీవులు, విరిచేసిన రెక్కలే ఆధారంగా బతుకునీడుస్తున్న వాళ్ళు దిక్కు తెలియని చోట్లకు కొట్టుకుపోయారు.

ప్రసాదమూర్తి తన కావ్యాన్ని కరోనా లాక్‌డౌన్ వలసల సందర్భంగా పలికిస్తున్నా, ఏనాడో మొదలైన, క్రీస్తుపూర్వం నుండి క్రీస్తు శకంలోకి ప్రవేశించిన మానవ ప్రవాస ప్రయాణాన్ని, లాక్‌డౌన్ అనే నిర్దిష్ట సన్నివేశం గురించి మాట్లాడుతూ సార్వజనీన చరిత్ర చేసాడు. 'పాదాలు తప్ప మరో అవయవం లేని / దేశం ఆత్మ నిర్భరతకు / అద్దం పట్టిన రహదారుల మీద / అందమైన ప్రణాళికల పూలతో / దేవుడూ సైతానూ జుగల్ బందీ / యుగాల కుట్ర' అని పేర్కొన్నారు.



పరిచయం

ప్రతి వ్యవస్థలోనూ ఏదో ఒక రూపంలో ప్రవాసముంటుంది. వలసలుంటాయి. ప్రతి వ్యవస్థ దానికి పరిమితులూ, వాటిని దాటే మార్గాలూ నిర్మించుకుంటుంది. కరోనా తాకిడికి కుప్పకూలిన సామాజిక ఆర్థిక వ్యవస్థకు తనని కాపాడుకునే మార్గాన్ని శ్రమజీవులు నగర బహిష్కారం విధించడంతో వెతుక్కుంది. తనకే మూలమైన నగర వలస కార్మికులను ఆధునిక సురక్షిత నిర్మాణ వ్యవస్థలకు అవతల దూరంగా విసిరేసి, నగరాల్ని దాటించి, రోడ్ల పాలు చేసి, వందలాది కిలోమీటర్లను కాలినడకన నడిపించి వాళ్ళ పాడుబడ్డ పల్లెటూళ్లకు తరిమివేసింది. నాలుగు సింహాల అధికారం జూలు దులిపి క్రూరంగా దాడి చేసింది. శ్రమజీవులని స్థానభ్రంశం చేసి ప్రవాసం చేసి, రోడ్ల మీద దారుణంగా గాయపడ్డ దేహాలతో కాళ్ళీడ్చే వలస కార్మికుల్ని చేసి వాళ్ళ రూపాలనే మార్చేసింది. వాళ్ళ శవాలు అనామకమయ్యాయి. వాళ్ళ కుటుంబాలు అనాధలయ్యాయి. వాళ్ళకందరికీ ఒకే ఉనికి. వలస కార్మికులు. 'నగరాల్ని మోసి మోసి/ అలసిపోయిన దేశీ రెక్కలు / పాదాలని తొడుక్కుని పారిపోతున్న/ దిక్కులేని జనగీతాలు/ శూన్య జలపాతాలు' గా మారిపోయిన అసంఖ్యాక జనప్రవాహం.

వాళ్ళ గురించి కవి ప్రసాదమూర్తి తన కవిత్వంలో ప్రశ్నల్ని రేకెత్తిస్తున్నారు. నిజంగా వాళ్లదేనా ఈ దేశం? నిజంగా వాళ్ళు తమ దేశానికే వెళ్తున్నారా? ప్రశ్నలే సమాధానాలు ప్రశ్నలకు 'మీకు అర్థం కాని వ్యర్థ అవయవాన్ని / ఏ దేశం రమ్మంటే ఆ దేశమే నాది', ఇదేనా మనమిచ్చే సమాధానం? కాదు. కాదని కవికి తెలుసు. అందుకే చరిత్ర శిథిలాలు తవ్వుతున్నాడు. ఈ వలసలకు అందమైన పేరు 'ఎక్సోడస్' అని పెట్టి మరీ ప్రశ్నిస్తున్నాడు. వాల్మీకి వారసుణ్ణయినా అణచివేతల ప్రస్థానాన్ని అశ్రుదగ్ధ కావ్యంగా మలచలేననీ, భిల్లుడిని దొంగగా మార్చిన అక్రమ చరిత్రనీ భీముని సంతానమైనా హిడింబి పుత్రుడిగానే గుర్తింపు పొందిన తనని తాను ఎన్నడో కోల్పోయానని ప్రకటిస్తున్నాడు. తమనుండి తాము కోల్పోయి, ఇతరులనుండీ కోల్పోయిన మనుషులు వలస కార్మికులు. రెండు ప్రవాసాల మధ్య బతుకుతున్న వారు. వదిలి వెళ్లిన సొంత ఊరే ప్రవాసంగా మారిన పరిస్థితి. రెండు నరకాల మధ్య బతుకుతున్న వారు. వారు వాళ్ళు కాదు. వాళ్ళకే పరాయి అయిపోయిన అస్తిత్వాలు. వాళ్ళ రెక్కల శ్రమ మీద నగరాలు నిలబడ్డా, ఆ నగరానికే పరాయైపోయిన అస్తిత్వహీనులు. అనామకులు.

కవికి వలస కార్మికుల చరిత్ర తెలుసు. వారి చరిత్రతో ఐడెంటిఫై అయ్యే తన చరిత్రా తెలుసు. పురాణాలూ విస్మరించిన బహుజనుల చరిత్ర అది. మనుస్మృతి నిరాకరించిన శూద్రుల చరిత్ర అది. సమానత్వం సామాజిక న్యాయమూ కరువైన కోట్లాది భారతీయ బహుజన కష్టజీవుల చరిత్ర అది. అందుకే, 'నిండా పోగేస్తే / నాలుగు వేల సంవత్సరాల చరిత్ర / నాతో ఆడిన నాటకం ఇదంతా / నన్ను ధ్వంసించి హింసించి నిర్మించిన దివారాత్ర నిరంతర భ్రమణాలివి' అని గుర్తించాడు. అందుకే ఆ చరిత్రనే, ఆ చరిత్ర మూలాలనే ప్రశ్నిస్తున్నాడు. వందలాది కిలోమీటర్లు నడిచి, మట్టిగొట్టుకుపోయి నెత్తురోడి పగుళ్ల బారి గాయాలైన పాదాలతో ప్రశ్నిస్తున్నాడు. ఎవరి దగ్గరున్నాయి సమాధానాలు? మళ్ళీ కవే తానెవరో, తన పేరేమిటో, తన చరిత్ర ఏమిటో, తన గాథను తానే గానం చేస్తున్నాడు. ఆ గాథే, ఆ గానమే ఈ దీర్ఘకవిత.

కవి తానే వలస కార్మికుడై, తానే ప్రవాసియై మాట్లాడాడు. తానే వాళ్ళ పాదాలు అయ్యాడు. పదాలు అయ్యాడు. వాళ్ళ భాష అయ్యాడు. తన కవిత్వాన్ని వాళ్ళుగా చేసాడు. వాళ్లనే తన కవిత్వం చేసాడు. ఇది ప్రసాదమూర్తి ఈ కవితలో సాధించిన కొత్తదనం, విజయం.

'నేను అదనపు జనం లోని వాడిని / ఏ దేశానికీ అవసరం లేని వాడిని / అసలు దేశమే లేని వాడిని'; 'కాలం బంతిలా తంతుంటే / దేహాలను దేశాలకవతల గుడారాలుగా పాతుకుంటున్న/ కాందిశీకుల కళ్ళలో కత్తుల కన్నీటి వాన నాది./ నాఫ్ నదిలో రోహింగ్యా కళేబరాన్ని,/ ఆత్మకు సిఏఏ మొలతాడు / మెడలో ఎన్నార్సీ ఉరితాడు / ఇది నిరంతర లాక్‌డౌన్ / నాది అనంత వలస' నాది అనంతవలస అని చివరి వాక్యంగా రాసి కావ్యాన్ని ఓపెన్ ఎండెడ్‌గా వదిలివేయడంలో కవి ప్రతిభ తెలుస్తున్నది.

ఒక దీర్ఘ కావ్యం రాయడం సులభం కాదు. ఎంతో పరిశోధన ఉండాలి. సమస్య గురించి దాని లోతుల్లోకి, చరిత్ర లోకి లోతైన అధ్యయనం చేయాలి. అధ్యయనం చేసినంత మాత్రాన మంచి కవిత రాయలేడు కవి. అలా రాయాలంటే గొప్ప కవితా హృదయం ఉండాలి, కరిగిపోయే హృదయముండాలి. వస్తువుని కవిత్వం చేసే నైపుణ్యమూ, శిల్పం మీద పట్టు ఉండాలి. అన్నింటికీ మించి అనుభవాల్ని గాఢమైన అనుభూతులుగా వ్యక్తీకరించి కవిత్వీకరించే గొప్ప కవి హృదయం ఉండాలి. సమస్య పట్ల వస్తువు పట్ల తాత్వికత ఉండాలి. ఇవన్నీ ప్రసాదమూర్తికి పుష్కలంగా ఉన్నాయి అనడానికి ఈ దీర్ఘ కవిత ఒక గొప్ప ఉదాహరణ. ఈ దీర్ఘ కవిత ఒక ఉద్వేగభరిత ప్రయాణం, ఒక దు:ఖభరిత ప్రయాణం. మనమూ వలస కార్మికులమౌతాం, మనమూ వారితో ప్రయాణిస్తాం. కవిత చదవడం అయిపోయేకల్లా మన పాదాల నిండా నెత్తురు, పగుళ్ళు, గాయాలు. మన కళ్ళలోంచి ధారాపాతంగా కన్నీళ్లు ప్రవహిస్తాయి.

(ఇది ఈ దీర్ఘ కవిత ముందుమాటలోని కొన్ని భాగాల కూర్పు. ఈ పుస్తకం ఫిబ్రవరి 12న విజయవాడ బుక్ ఎగ్జిబిషన్లో ఆవిష్కరణ అవుతుంది.)

- నారాయణస్వామి వెంకటయోగి

న్యూజెర్సీ, అమెరికా

మా అస్థిత్వం పేరు అడవి

ఏ తోడేళ్లు మమ్మల్ని కొండమేకల్నిజేసీ
వెంటాడుతున్నాయి?
ఏ పెద్దపులులు మమ్మల్ని అడవి జింకల్ని జేసీ
వేటాడుతున్నాయి?
ఏ గండభేరుండాల రెక్కలల్లార్పుకు
మా కాళ్ల కింద నేల కదలబారుతోంది?
పొగబెట్టి పట్టునుండి తేనెటీగల్ని తరిమినట్టు
పుట్టి పెరిగిన నేలమీంచి
మమ్మల్ని తరుమిగొడుతున్నదెవరు?
తరాల పురిటి జ్ఞాపకాలు తలకెత్తుకొని
ఉభికే దుఃఖాన్ని ఉగ్గబట్టుకొనీ
యీ పచ్చనికొండలమీంచి ఎక్కడికని పొమ్మంటారు?
బొందిలో ప్రాణాలు యిక్కడే విడచి
నడచే శవాలమై ..
చితిలోంచి లేచే పొగమేఘాలమై ..
దిక్కులపట్టి ఎక్కడికని ఎగిరిపొమ్మంటారు ?

నెపం అభివృద్ధి మీదపెట్టి
అడవికి మమ్మల్ని దూరంజేస్తున్న వాడెవడో
వాడి అభివృద్ధి మీద మన్నుబడ ..
వాడి హైడ్రో పవర్ ప్రాజక్టులు ఆవిరైపోనూ ..
మా పీసాచట్టం పీక పిసికేసాక ..
మా ఐదవషెడ్యూల్ అటవీచట్టాల్ని అడుగేసి మట్టేసాక
..
కాట్లో కొరివిలా మండుతోందివాల కొయ్యూరు
చింతనిప్పులు చెరుగుతోంది చింతపల్లి
బందూకుల మధ్య బందీయైపోయింది గొందిపాకల
చావుశంఖం పూరిస్తోంది సమగిరి
ఎర్రిచూపులు చూస్తోంది ఎర్రవరం
అల్లకల్లోలమైపోతోందివాల అల్లూరి జిల్లా
యిది ఆదివాసీ చేసే ఆకలి పోరాటం
చచ్చిన పక్షిరెక్కలా కాలిపోయిన పోడు వదిలి
దుఃఖమంతా ఒకచోట పోగేసినట్టున్న గూడువదిలి
పిల్లాజెల్లా లొల్లాడి కట్టుకొనీ ..
గొడ్డూగోదా వెంటబెట్టుకొనీ ఎక్కడికని పొమ్మంటారు?

ఏడ్చి ఏడ్చీ కంటిచెరువులో యింకిపోయాయి నీళ్లు
చిగురాకుల్లా స్వచ్ఛంగా బతికిన వాళ్లం
ఎండుటాకులైరాలి ధూళిధూసర దేహాలతో
కార్పోరేట్ పెనుగాలికి కొట్టుకుపోతున్నాం
వనాల్లో బతికిన వాళ్లం నాగరిక జనాల్లో ఎలా
బతుకుతాం?
బతుకుదారి తప్పిన బెదురు జింకలమై
పట్నం పరాయిపంచన ఎలా గడుపుతాం?
తలచుకుంటేనే .. భరించలేని గుండెకోత
అయినా తప్పదీ బతుకునదిలో ఎదురీత !

అయినా ఎన్నాళ్లిలా?
మీరు తరిమిగొడుతుంటే మేం బెదిరిపోయేదిక చాలు
ఎవడెవడోవచ్చి ఎవడెవడికో అప్పనంగా కట్టబెట్టేందుకు
అడవి మీ యబ్బసొత్తు కాదు
మా తరాల మూలవాసుల జన్మహక్కు
మేం అడవిబిడ్డలం .. అల్లూరి వారసులం ..
తూరుపు దిక్కున ఎగిసే పోరుమంటలం ..
మా అస్థిత్వం పేరు అడవి ..
మా తెగువ పేరు పోరాటం ...

(అల్లూరి జిల్లా ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజక్ట్‌కు నిరసనగా ..)

- సిరికి స్వామినాయుడు

తోటమాలి

అతడు సూరీడుతో పోటీ పడతాడు
దాని కంటే ముందుగా
తోటలోకి వస్తాడు
సూరీడుతో స్నేహం చేస్తాడు
రెండు చేతులూ పైకెత్తి
రా రమ్మని పిలుస్తాడు
లేలేత కిరణాల్ని దోసిట్లోకి తీసుకుని
లేలేత ఆకులకు తినిపిస్తాడు
అతడు సామాన్యుడు కాదు
భూమికీ ఆకాశానికీ మధ్య
వారధి కడుతున్న నిర్మాణ నిపుణుడు

అతడు మొక్కలతో మాట్లాడుతాడు
పువ్వులతో ముసిముసిగా నవ్వుతాడు
ఏంటి తాతా ఇది అంటే
ఆకులు పలకరిస్తున్నాయి చూడమంటాడు
వాటికి తలంటుతాడు
ఒళ్ళంతా మెల్లగా నీటితో నిమురుతూ
స్నానం చేయిస్తాడు
సబ్బూ షాంపూ పెట్టమని
నేను వెటకారమాడుతాను
బురద మట్టితో మొక్క వేళ్ళను
సుతారంగా ఒత్తుతాడు
మొక్కలకు పున్నమి చూపిస్తాడు
వెన్నెల్లో తడిసి అలుపులేకుండా ఆడుకుంటున్న
మొక్కల్ని చూసి మురిసిపోతాడు
ఎండాకాలంలో
ఆకుపచ్చ వలతో గొడుగు పడతాడు
వానాకాలంలో
నాలుగువైపులా చిన్న చిన్న కాలువలు తీస్తాడు

అతడు శ్వాస బిందువులను
కాలంతో కలిపే సరళరేఖ
తాతకు మొక్క అంటే పసిపాప
దాని బుగ్గలు ఎరుపెక్కితే
తాత కనురెప్పల కింద నల్లఛాయ వస్తుంది
అంత గారాబం ఎందుకంటే
నువ్వు పెద్దోడివైపోయావంటాడు
తాత మొక్కల భాష
నాకు ఎంతకీ అర్థం కాదు!

ఉన్నట్టుండీ ఓ వేకువజామున
నేను బాల్యంలోకి వెళ్ళిపోయాను
తోటలోకి వెళ్లి చప్పుడు లేకుండా చూసాను
అప్పుడు మొక్కల భాష
నా రక్తనాళాల్లోకి చేరిపోయింది.

- కిల్లాడ సత్యనారాయణ

వెలుతురు వైపు నడిపించే 'చీకటి పువ్వు'

గత సంవత్సరం తెనాలి కళల కాణాచి వారి నాటికల పరిషత్తులో మొదటిసారి పోటీపడి గుర్తింపు తెచ్చుకొని, ఇప్పటికే పలుచోట్ల ప్రదర్శిస్తూ బహుమతులు గెల్చుకున్న, గెలుచుకుంటున్న చైతన్య కళా సమితి కరీంనగర్ వారి నాటిక చీకటిపువ్వు. రచన, పిఎస్ నారాయణ. నాటకా అనుసరణ పరమాత్ముని శివరాం.

చీకటి పువ్వు ... పేరు నాటికను చూడాలనే ఉత్సుకత కలిగిస్తుంది. ఈ చీకటి పువ్వుకి ఒక శరీరాన్ని, దానికి ఒక పేరు ఇస్తే .. అది 'పవిత్ర'. ఉదాత్తంగా ఈ పాత్రను తీర్చిదిద్దడంలో రచయిత ఉద్దేశం- "పరిస్థితులకి ఏ మనిషీ అతీతం కాదు. అవసరంతోనో, వేరే అవకాశం లేకో, చాలామంది తప్పులు చేయటం సహజం. తమ తప్పు తెలుసుకుని పశ్చాత్తాప పడిన తర్వాత కూడా వారిని దూరం పెట్టకండి. క్షమించి దగ్గరకు తీయండి. క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉంది" అనే మానవత్వాన్ని మేల్కొల్పటం. కథా మూలానికి చక్కని సంభాషణలు, సన్నివేశాలు, సస్పెన్స్, ఉద్రేకాలు, ఉద్వేగాలు, అపనమ్మకాలు, ఆత్మవిశ్వాసం, అవసరాలు మనుషుల్ని ఏ బంధాలు లేకపోయినా ఎలా దగ్గరగా మనసును కట్టివేస్తాయో చెప్పే నాటిక ఇది.

అర్ధరాత్రి ఒక స్త్రీ, పర పురుషుని గదిలో ఉండటం, ఆ గదిలో అప్పుడే చనిపోయిన వ్యక్తి శవం ఉండడం, పక్కింటి వాటాల్లో ఉన్న ఇద్దరి సహాయం తోడు తీసుకోవడం, అందులో ఒకరు అర్థం చేసుకుంటే ... మరొకరు అవకాశం దొరికింది కదా అని ఆమెను తన శూలాల్లాంటి మాటలతో గుచ్చి గుచ్చి చంపటం .. కథను ఆసక్తికరం చేస్తుంది. ఒక మృతదేహాన్ని అతడి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చాలన్న ఆమె తపనను ... కుటుంబ సభ్యులు అపార్థం చేసుకుంటారు. అంతిమంగా ఆమె మానసిక పవిత్రతను గుర్తించి మనిషిని బట్టి, చేసే వృత్తిని బట్టి, గుణాన్ని అంచనా వేయటం పొరబాటని గ్రహిస్తారు. ఈ నాటిక ముఖ్య పాత్రల గురించి చూద్దాం.

పవిత్ర : మూడు నిమిషాల సుఖం కోసం ఏడడుగుల దూరంలో శవాన్ని పెట్టుకుని మాటలతో వేధించే సోకాల్డ్ సభ్య సమాజంలో.. మంచివాళ్లే తన దీనస్థితికి కారణం అంటుంది. ఎందుకంటే ఆ మంచి వాళ్ళు ఆమెని రతి పుత్రికగా, శృంగారనేత్రిగా, సుఖ ధాత్రిగా మాత్రమే చూస్తారు కాబట్టి. అలా 'చీకటి' ఆమె జీవితంలో కాస్తంత వెలుగు. అలాంటి ఒకానొక చీకటి పువ్వామే! తన జీవిత సర్వస్వం అయిన పిల్లాడి చదువు కోసం వ్యభిచారం చేస్తూ, 'తెల్లవారుజాము రెండు గంటలకు నన్ను వదిలేస్తారా? వాడిని లేపి పరీక్షలకు చదివించాలి' అని దీనంగా అడిగితే, ఆ మాటలు ఎంత బలంగా తాకుతాయో కదా! ఆమె జీవితంలోకి మొదటిసారి, ఓ సజ్జనుడు తారసపడతాడు. అయితే అతడి హఠాన్మరణం

రంగస్థలం

ఇప్పుడు ఆమెను మరొక రకమైన ఇబ్బందికి గురిచేసింది. అయితే ఆ వ్యక్తి ఇచ్చిన ఆత్మవిశ్వాసం మనోధైర్యమే.. ఆమెని, ఆమె జీవితాన్ని నిలబెట్టింది.

మోహన్ : కొంతమంది వాళ్ళ ఆత్మకథల్ని రాస్తే, తాను మాత్రం తన ఆత్మ వ్యథని రాస్తున్నానంటాడు. జీతంలోనే జీవితాన్ని సర్దుకుందాం అంటే డబ్బు అవినీతి మార్గంలోనైనా సంపాదించమని వేధించే భార్య అతడి జీవిత భాగస్వామి కావడం అతడి వ్యథార్థ జీవితానికి కారణం. ఆ క్రమంలో అతడు లంచగొండి, తాగుబోతు, వ్యభిచారి అవుతాడు. అయితే అతడిలో మంచితనం చచ్చిపోలేదు. ఒక రాత్రి అతడి అవసరపు కళ్ళకి, పవిత్ర ఒళ్ళు కట్టిపడేస్తే నచ్చడమే కాదు పడి చచ్చేంతగా అతనిలోని కవిని తట్టి లేపింది. 'నువ్వు చేసే తప్పుల్లో నిజాయితీ ఉంది, నేను చేసే తప్పుల్లో అవినీతి ఉంద'ని ఒప్పుకునే నీతి ఉన్నవాడు.

వంశీ : మోహన్ ప్రసాద్ పక్కవాటాలోకి అంతకు ముందు రోజే అద్దెకు దిగినందువల్ల పక్కింట్లో ఎవరుంటారో తెలియదు అతనికి. అర్ధరాత్రి ఒక పడుచు పిల్ల ... పక్కింటి వ్యక్తి మరణించాడు, సహాయం కావాలంటుంటే ఎలా అర్థం చేసుకోవాలో తెలియని కన్ఫ్యూజన్లో ఉంటాడు. శవాన్ని బయట పడుకో పెట్టాలన్నా, మరో మనిషి తోడు కావాలి. మరో పొరుగు వారి సహాయం కోరదామంటే.. అతడు తాగుబోతు. డైరీలో ఫోన్ నెంబర్ వెతికి మోహన్ ప్రసాద్ భార్య.. రాధికకు ఫోన్ చేస్తే ఆమె సంధించిన ప్రశ్నలు మరింత అయోమయంలో పడేస్తాయి వంశీని. భర్త చనిపోయాడు అంటే యాక్సిడెంటా? కాళ్లు చేతులు విరిగాయా? వచ్చి సేవలు చేయాలా? అని అడుగుతుంది. మూడు ముళ్ళ తాడు తెంచుకోవడానికి 300 కిలోమీటర్ల రావాలా? అని అడుగుతుంటే, వారి వివాహ బంధాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

హరి : నాటికలో దుష్ట పాత్ర అయినా నాటికకు కథానాయకుడు ఇతడే. మనుషులు తమ స్వార్థం కోసం ఎంతకు దిగజారి తమ అవసరాల పూర్తి కోసం ఎంత అమానవీయంగా వ్యవహరించగలరో, అసహాయ అబలల పట్ల ఎంత కర్కశత్వాన్ని చూపగలరో, అంతటి విలనిజంకి అవకాశం ఉన్న పాత్ర. పవిత్ర పక్కన వంశీని చూసి- 'శవం కట్టెలో కాలకముందే ఇంకో కస్టమర్‌కి కనెక్ట్ అయిపోయావా? అయినా ఆలికి లేని బాధ వెలయాలికి ఎందుకో? అంటాడు వ్యంగ్యంగా. మీకు సెటిల్మెంట్లే కాదు, సెంటిమెంట్లు కూడా ఉంటాయా? .. మోహన్ స్థానం ఖాళీ అయిందిగా, ఆ ప్లేస్‌లోకి నన్ను తీసుకో...' అంటూ వికారంగా కామెంట్ చేస్తాడు. పవిత్ర క్యారెక్టర్ ఏమిటో తెలుసుకున్న తర్వాత.. తన ప్రవర్తనకు క్షమాపణలు కోరతాడు.

సిద్ధు : తల్లి మాటల వల్ల తండ్రిపై విపరీతమైన ద్వేషం పెంచుకుంటాడు. తండ్రి చనిపోయాడన్న విషయం తెలుసుకుని ఇంటి పత్రాల కోసం వస్తాడు. 'తండ్రి చనిపోతే ఏ కొడుకు అయినా కన్నీటితో సాగనంపుతాడు కానీ నేను కడుపు మంటతో సాగనంపుతున్నాను.' అంటాడు. 'నాన్నను వదులుకున్నానని ఆస్తిని వదిలేస్తామనుకున్నావా?' అంటూ పవిత్రపై భౌతిక దాడి చేస్తాడు. పవిత్ర ఇచ్చిన తండ్రి డైరీ చదవడంతో సిద్ధూలో కూడా తీవ్రమైన మార్పు వస్తుంది. 'నాన్నా.. అమ్మ మాటలు నమ్మి మిమ్మల్ని దూరం చేసుకున్నాను. నిజం తెలియక నిందించాను. నన్ను క్షమించండి నాన్న' అంటూ కన్నీటి పర్యంతమవుతాడు. 'నాన్న చనిపోలేదు.. డబ్బు చుట్టూ తిరిగే మా ఆర్థిక సంబంధాలు నాన్నని చావు దెబ్బ కొట్టాయి. చివరగా మనిషిని బట్టి, చేసే వృత్తిని బట్టి గుణాన్ని అంచనా వేస్తే అది పొరపాటు అవుతుంది.' అంటూ పవిత్ర పాదాలపై పడి క్షమాప్రార్థన చేస్తాడు.

చక్కని కథకు, అతి చక్కని నాటకీకరణ చేసి మనసును తాకే సంభాషణలు పరమాత్ముని శివరామ సమకూర్చగా, మంచాల రమేష్, హరి పాత్ర ధరించి దర్శక బాధ్యతలు కూడా చేపట్టాడు. పాత్రధారులు అందరూ పాత్రల స్వరూప స్వభావాలకు తమ నటనా ప్రతిభతో నాటికను బాగా ఎలివేట్ చేసి ప్రదర్శించినందున పలు ప్రతిష్టాత్మక పరిషత్తులలో, ఇతర ఆహ్వానిత ప్రదేశాల్లో, పలు ఉత్తమ బహుమతులు అందుకున్నారు. పవిత్రగా గుడివాడ లహరి, వంశీగా కొత్తకొండ సత్యనారాయణ, సిద్ధార్థగా శివరామిరెడ్డి, మోహన్ ప్రసాద్‌గా టీవీ సినిమా నటుడు విజయ్ కుమార్- పాత్రలకు జీవం పోశారు. సంగీతం సురభి నాగరాజు, ఆహార్యం రంగాలంకరణ- నాగు.

రంగస్థలం నాటకం ప్రేక్షకులను ఆలోచనకు గురిచేసి, చైతన్యం నింపి సమాజ దశా దిశ మార్చడంతో పాటు వ్యక్తులలో మానవీయ స్పందన ఆలోచన, సమాజాన్ని చూసే దృష్టి కోణంలో మార్పును తీసుకురాగల నాటకమే ఉత్తమ నాటకంగా చెప్పుకోవచ్చు. 'చీకటి పువ్వు' అలా, చీకటి నుంచి వెలుతురు వైపు నడిపించే నాటిక.

- మల్లేశ్వరరావు ఆకుల

79818 72655

ఆ దిక్కుగా ...

దగ్ధమవుతున్న చీకటి చివరల్లో
వేదనాభరిత శిథిలాగ్రస్త దేహంలో...
విడిపోతున్న మనుషుల మనసులకు
మాసికలతోనైనా అతుకులు పెట్టే
విఫలయత్నం కొనసాగుతూనే వుంది
రంగులీనుతున్న రాగద్వేషాల
సుడిగుండంలో
దిక్కులకు జరిగిపోతున్న
మనుషులను ఒడిసి పట్టుకోలేక
కలిపికుట్టే అక్షరాల్ని వడక లేక
నిరంతరం నాలుగురోడ్ల కూడలిలోనే
నలుగురు కూర్చుని నవ్వాల్సినవేళ
దుఃఖమొక్కటే టీ కప్పును నింపుతోంది

ఆకాశం నుంచి జారుతోన్న చివరి
చినుకు
పొడిబారిపోయి ముక్కలవుతూనే
రాలిన జాగాలో తేమకోసం
వెతుకులాట
పగుళ్లుబారిన కాగితాల మీద
ఇంకిపోయిన మాటల్లో
పచ్చదనాన్ని పులిమే మిషలో...
గిడసబారిన కలం
చేతుల్లో నిలవడంలేదు
అల్మారాల్లో పోసిన కాగితాల గదుల్లో
ఎక్కడనుండో ప్రసరిస్తోన్న
దుమ్ముకిరణాల వెలుగులో
కాఫీ టేబుల్ పై ఏదో విషాదం
ఒలుకుతోంది.

హోరున ఎగసిపడుతోన్న
సముద్రానికి ఎదురుగా
పరుగులు తీస్తోన్న నత్తగుల్లల్లోంచి
తల బయటకు పెట్టి
శత్రువు ఉనికిని పసిగట్టే
ప్రయత్నంలో...
దాగుడుమూతలాట లోంచే
ఆట మాటున వాడు
శాశ్వతంగా కనుమరుగవుతాడు
హాజరు పరిచిన వాళ్ళల్లో
వాడి ఆనవాళ్లు ఎక్కడా కనబడవు
ముఖానికి ఏవేవో లేబిళ్లు అతికించుకొని
ఎవరెవరో కొన్ని నినాదాలు చేస్తుంటారు
దు:ఖతీరాల్లో
హఠాత్తుగా లేచిన ఓ శిలావిగ్రహం
తూర్పు దిక్కుగా వేలుపెట్టి చూపిస్తూ
వుంటుంది

- బండ్ల మాధవరావు

కథా సంపుటాలకు ఆహ్వానం

సాహితీ స్రవంతి కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శిగా, కవిగా, కథకుడుగా సాహిత్య వికాసానికి కషి చేసిన తెలుగు ఉపాధ్యాయుడు సంకటి మహేశ్వరయ్య. ఆయన స్మారక సాహిత్య పురస్కారాన్ని ఏటా ఇవ్వాలని సాహితీ స్రవంతి జిల్లా కమిటీ నిర్ణయించిన నేపథ్యంలో- 2022 సంవత్సరానికి గానూ కథాసంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కథకులు 2022లో వెలువడిన తమ కథా సంపుటాలను 3 ప్రతులు పంపాలి. ఎంపికైన కథకులకు రూ.5000 నగదు, జ్ఞాపికతో సత్కారం ఉంటుంది. కథా సంపుటాలను 2023 మార్చి 15 లోగా 'కెంగార మోహన్, పురస్కార కమిటీ అధ్యక్షులు, ఇ.నెం.43-238, ఫ్లాట్ నెం:102, ఎన్వీఆర్ ప్లాజా, రోడ్ నెం:8 ఎన్.ఆర్ పేట, కర్నూలు-518004' చిరునామాకు పంపాలి. వివరాలకు 9493375447 నెంబర్లో సంప్రదించొచ్చు. 27.04.2023న కర్నూల్లో జరిగే మహేశ్వరయ్య ద్వితీయ వర్ధంతి సభలో పురస్కార ప్రదానం ఉంటుంది.

జయరాజు, కె శ్రీనివాస్‌లకు మఖ్దూమ్ జాతీయ పురస్కారం

హైదరాబాదు సిటీ కాలజీ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కార (2022, 2023) ప్రదానోత్సవ సభ మఖ్దూమ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 4 శనివారం ఉదయం 10.30 గంటలకు కళాశాల గ్రేట్ హాల్లో జరుగుతుంది. 2022 పురస్కారం జయరాజుకు, 2023 పురస్కారం కె.శ్రీనివాస్‌కు ప్రదానం చేస్తారు. పురస్కార గ్రహీతలకు ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపిక, రూ.10 వేల నగదు అందజేస్తారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.బాలభాస్కర్ అధ్యక్షతన జరిగే సభలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య తంగెడ కిషన్ రావు, డా.యాకూబ్ అతిథులుగా పాల్గొంటారు.

12న అరుణ్ సాగర్ స్మారక పురస్కార ప్రదాన సభ

ప్రముఖ కవి, విలక్షణ జర్నలిస్టు అరుణ్ సాగర్ పేరిట ఇచ్చే పురస్కారాలను ఈ సంవత్సరం ప్రముఖ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, ప్రముఖ కవయిత్రి కుప్పిలి పద్మకు అందజేయనున్నారు. ఫిబ్రవరి 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్లో నిర్వహించే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం ఉంటుంది. అల్లం నారాయణ, తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, జూలూరు గౌరీశంకర్, గోరటి వెంకన్న, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ఘంటా చక్రపాణి, కె.శ్రీనివాస్, వర్ధెల్లి మురళి తదితరులు పాల్గొంటారు.

డా. పుట్ల హేమలత స్మారక పురస్కారాలు 2023

2023 సంవత్సరానికి రచయిత్రి అరుణ గోగులమండ, జర్నలిస్ట్ తులసి చందులకి డా. పుట్ల హేమలత స్మారక పురస్కారం ప్రకటించారు. ఫిబ్రవరి 9న హేమలత వర్ధంతి సందర్భంగా పురస్కారాలు అందిస్తున్నట్లు మనోజ్ఞ సాంస్కృతిక సాహిత్య వేదిక అధ్యక్షురాలు ఎండ్లూరి మానస తెలిపారు. రచయిత్రి పుట్ల హేమలత పేరు మీద 2019 నుంచి వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలకు ఈ పురస్కారాలు ఇస్తున్నారు.

14వ జాతీయ స్థాయి 'సోమేపల్లి' చిన్న కథల పోటీ

రమ్యభారతి ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా సోమేపల్లి జాతీయ స్థాయి కథల పోటీ నిర్వహిస్తున్నాం. అత్యుత్తమ కథకు రూ.2500, ఉత్తమ కథకు రూ.1500, మంచి కథకు రూ.1000, ప్రత్యేక బహుమతులు రూ.500 చొప్పున ఇద్దరికి ఇవ్వనున్నాం. రచయితలు పంపే కథలు రాతలో రెండు నుంచి 4 పేజీలలోపు, డిటిపిలో అయితే 2 పేజీలు దాటరాదు. ఒకరు ఎన్ని కథలైనా పంపవచ్చు. హామీపత్రంపై మాత్రమే రచయిత వివరాలు పేర్కొనాలి. కథలను ఫిబ్రవరి 28వ తేదీలోపు రమ్యభారతి, పి.బి.నెం.5, 11-57/1-32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ-520001 (సెల్:9247475975) అనే చిరునామాకు పంపాలి.

- చలపాక ప్రకాష్, సంపాదకుడు, రమ్యభారతి

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. **అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..** prajasavvadi@gmail.com

బిబిసి డాక్యుమెంటరీ చూశారని 14 మంది విద్యార్థుల సస్పెన్షన్

- ఎబివిపి ఒత్తిడితో రాజస్థాన్ సెంట్రల్ వర్సిటీ చర్యలు

జైపూర్ : ప్రధాని మోడీపై బిబిసి రూపొందించిన డాక్యుమెంటరీని వీక్షించిన 11 మంది విద్యార్థులపై రాజస్తాన్ సెంట్రల్ యూనివర్సిటీ వేటు వేసింది. బిజెపి విద్యార్థి విభాగం ఎబివిపి 24 మంది విద్యార్థుల జాబితాను విడుదలచేసి.. వారిపై చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీని డిమాండ్ చేసినట్టు తెలుస్తున్నది. దీంతో శుక్రవారం నుంచి 14 రోజుల పాటు విద్యార్థులను యూనివర్సిటీ, హాస్టల్ నుంచి సస్పెండ్ చేసింది. ఎబివిపి విద్యార్థుల ఒత్తిడితోనే యాజమాన్యం వేటువేసినట్టు పిజి విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎబివిపి కార్యకర్తలు క్యాంపస్‌లో గురువారం ఉద్రిక్తతలను సృష్టించారని, జైశ్రీరామ్, దేశ ఉగ్రవాదులను కాల్చి పారేయండి అని నినాదాలు చేశారని పిజి విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు తమ మొబైల్ ఫోన్‌లలోనే ఆ వీడియోను వీక్షించారనీ.. ఎక్కడా ప్రదర్శించలేదని చెప్పారు. సస్పెన్షన్‌కు గురైన విద్యార్థుల హాస్టల్ గదుల్లోకి బలవంతంగా ప్రవేశించి విద్యార్థులను బెదిరించారని తెలిపారు.

త్రిపుర ఎన్నికలు : 20 మందితో జాబితా ప్రకటించిన 'టిప్రా'

అగర్తల : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న 20 మంది అభ్యర్థుల జాబితాను త్రిపుర ఇండిజీనియస్ ప్రొగ్రెసివ్ రీజినల్ అలయన్స్ (టిఐపిఆర్ఎ-టిప్రా మోతా) విడుదల చేసింది. పట్టు ఉన్న ప్రాంతానికి వెలుపుల 8 స్థానాలకు కూడా టిప్రా అభ్యర్థులను ప్రకటించడం గమనార్హం. త్రిపుర రాజవంశీయుడైన ప్రద్యోత్ విక్రమ్ మాణిక్య దేవవర్మ టిప్రా మోతాకు నాయకత్వం వహిస్తున్న సంగతి విదితమే. తనతో పాటు రాజవంశీయులెవ్వరూ ఎన్నికల్లో పోటీ చేయబోరని జాబితా విడుదల సందర్భంగా శనివారం రాత్రి ప్రద్యోత్ వెల్లడించారు. బిజెపికి సన్నిహితంగా ఉండే ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి), టిప్రా ఎన్నికల ముందస్తుగానే పొత్తు పెట్టుకోవాలని ప్రయత్నాలు జరిగాయి. అయితే అవి ఫలించలేదు. దీంతో టిప్రా ఒంటరిగానే బరిలో దిగుతుందని ప్రద్యోత్ ప్రకటించి జాబితా విడుదల చేశారు.

శ్రీనగర్ చేరిన జోడోయాత్ర

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర సోమవారంతో ముగింపు దశకు చేరుకుంది. ఈ సందర్భంగా జనవరి 30న శ్రీనగర్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి 12 ప్రతిపక్ష పార్టీలు హాజరుకానున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి 21 పార్టీలను ఆహ్వానించామని, అయితే భద్రతాకారణాల రిత్యా కొందరు హాజరుకావడం లేదని ఆ వర్గాలు వెల్లడించాయి. సిపిఎం, సిపిఐలతో పాటు డిఎంకె, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, ఆర్‌జెడి, జెడియు, శివసేన, విసికె, కేరళ కాంగ్రెస్, ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని జమ్ముకాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి), షిబు సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) శ్రీనగర్‌లో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. టిఎంసి, సమాజ్‌వాది పార్టీ, టిడిపి పార్టీలు ఈ కార్యక్రమానికి దూరంగాఉన్నాయి. భద్రతా వైఫల్యంతో శుక్రవారం రద్దైన యాత్ర శనివారం అవంతిపోరాలోని చెర్సూగ్రామం నుండి ప్రారంభమైన ఈ యాత్రలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీలు పాల్గొన్నారు. గతేడాది సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుండి జోడోయాత్ర ప్రారంభమైన సంగతి తెలిసిందే.

సమాచారానికి మోడీ సర్కార్ సంకెళ్లు

- పార్లమెంట్ ఆమోదం లేకుండానే అమల్లోకి 'ఐటి నిబంధనలు'
- డిజిటల్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు బెదిరింపులు
- సందేశాలు, వీడియోలు తొలగించాలంటూ ఆదేశాలు

తాము మెచ్చింది..తమకు నచ్చిందే ప్రజలు తెలుసుకోవాలని..చూడాలని మోడీ సర్కార్ బలంగా భావిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక సమాచారం బయటకు రాకుండా ఆంక్షలు విధిస్తోంది. చట్టాల్ని మార్చుతోంది. 'సెన్సార్‌షిప్'ను అమల్లోకి తెస్తోంది. ఐటి నిబంధనలు (సవరణ)-2021 ముసాయిదా బిల్లును పార్లమెంట్ ఆమోదించలేదు. అయినా అందులోని 'అత్యవసర అధికారాల్ని' ప్రయోగిస్తూ 'బిబిసి డాక్యుమెంటరీ'ని కేంద్రం నిషేధించింది. ఇండియా : ద మోడీ క్వశ్చన్..ప్రసారం చేయవద్దని బిబిసి లాంటి అంతర్జాతీయ మీడియా సంస్థలనే బెదిరిస్తోంది. ట్విట్టర్, యూట్యూబ్‌ల్లో ప్రసారం కాకూడదంటూ ఆదేశాలు జారీచేసింది. దీనిపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. మరోవైపు విశ్వవిద్యాలయాల్లో సామూహికంగా ఈ డాక్యుమెంటరీని ఇంటర్నెట్ ద్వారా చూస్తున్న విద్యార్థులపై కాషాయ గూండాలతో బిజెపి దాడులు చేయిస్తోంది. బిజెపి, ఎబివిపి, యువజన మోర్చా నాయకులు, కార్యకర్తలు వర్సిటీల్లోకి చొరబడి విద్యార్థులపై దాడులకు తెగబడుతున్నారు.

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ చిన్న వార్త బయటకు రాకుండా మోడీ సర్కార్ పెద్ద ఎత్తున అధికార వ్యవస్థల్ని రంగంలోకి దించుతోంది. రాజకీయ, అధికార బలాన్ని, ప్రభుత్వ పరపతిని వినియోగిస్తోంది. 'సెన్సార్‌షిప్' అనేక రూపాల్లో, విధానాల్లో అమలవుతోంది. అత్యంత కీలక సమాచారమంటూ కోర్టులకు సీల్డ్ కవర్లలో అధికారిక సమాచారాన్ని ఇవ్వటం దగ్గర్నుంచి...వర్సిటీల్లో 144 సెక్షన్ విధింపు వరకు ఇదీఅదీ అన్న తేడా లేదు. ఎక్కడికక్కడ కఠినమైన ఆంక్షలు, సెన్సార్‌షిప్ విధించటమే ముఖ్య విధానంగా మోడీ సర్కార్ పాలన కొనసాగుతోంది. పాలకులకు వ్యతిరేకంగా వార్తలు రాసే జర్నలిస్టులపై కేసులు నమోదు చేయటం అందులో ఒకటి. కాశ్మీర్ జర్నలిస్టు ఆసిఫ్ సుల్తాన్‌ను ఆగస్టు 2018 నుంచి జైల్లో నిర్బంధించారు. బిబిసి డాక్యుమెంటరీని బయటకు రాకుండా, ప్రదర్శించకుండా కేంద్రం చేయని ప్రయత్నం లేదు.

వర్సిటీల్లో ఈ వీడియో ప్రదర్శనలు జరగకుండా పోలీసులను పెద్ద సంఖ్యలో రంగంలోకి దింపింది. విద్యార్థి సంఘాలపైకి పోలీసుల్ని ఉసిగొల్పింది. మరోవైపు వర్సిటీల్లోకి కాషాయ గూండాలు చొరబడి విద్యార్థులపై దాడులకు పాల్పడుతున్నారు. బిబిసి డాక్యుమెంటరీని ప్రదర్శనీయకుండా అడ్డుకుంటున్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం వేడుక జరుపుకుంటున్నవేళలో, మరోవైపు ఢిల్లీలోని జెఎన్‌యు, జామియా మిలియా, ఢిల్లీ యూనివర్సిటీ, చండీగఢ్..అనేక వర్సిటీల్లో డాక్యుమెంటరీ ప్రదర్శనలను కేంద్రం అడ్డుకుంది. క్యాంపస్ కేంద్రాల వద్ద

విద్యుత్ సరఫరా, వైఫై ఇంటర్నెట్ నిలిపివేసింది. పోలీసులను పెద్ద సంఖ్యలో మోహరించి..విద్యార్థుల్ని భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇదంతా చూస్తే..దేశంలో ప్రజాస్వామ్య పాలన ఉందా? అనే సందేహం కలుగుతోంది. ప్రధాని మోడీ ఒక నియంతలా దేశాన్ని ఏలాలని తపనపడుతున్నారు.

ఆర్‌టిఐ చట్టానికి తూట్లు

సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) సమాచారం పౌరులకు ఒక ఆయుధంగా మారుతోందన్న భయం మోడీ సర్కార్‌ను వెంటాడుతోంది. ద్వారా ప్రభుత్వ సమాచారం పౌరులకు చేరటం అన్నది కేంద్రంలోని పాలకులకు సహించటం లేదు. భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన 'ప్రాథమిక హక్కుల'ను సైతం బలహీనం చేయాలన్న వ్యూహంతో వెళ్తోంది. భావ ప్రకటనా స్వేచ్ఛను ఇప్పటికే చాలావరకు దెబ్బతీసింది. ఆర్‌టిఐ పంటి కింది రాయిగా మారిందని భయపడుతోంది. దాంతో ఈ చట్టానికి తూట్లు పొడుస్తూ..బలహీనం చేయటమే పనిగా పెట్టుకుంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్ల వద్ద మూడు లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

కొత్త ఐటి నిబంధనలు

ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సంస్థల్ని తమ చెప్పు చేతుల్లో పెట్టుకునేందుకు 'ఐటి నిబంధనలు, 2021'ని తెరపైకి తెచ్చింది. ఇందులోని పలు నిబంధనల్ని చూపుతూ బెదిరిస్తోంది. ఇందులోని 'అత్యవసర అధికారాలు' అనేది ప్రయోగిస్తూ 'బిబిసి డాక్యుమెంటరీ'పై కేంద్రం నిషేధ ఉత్తర్వులు జారీచేసింది. దాంతో ఈ వీడియో, వాటి లింకులు, స్పందనలు..అన్నింటినీ ట్విట్టర్, యూట్యూబ్ తొలగించాల్సి వచ్చింది. తొలగించిన వాట్లో ప్రఖ్యాత న్యాయవాది ప్రశాంత్ భూషన్ ట్వీట్ కూడా ఉంది. వాస్తవానికి కొత్త ఐటీ నిబంధనలు, 2021..ఒక ముసాయిదా బిల్లు మాత్రమే. అయితే ఇది పార్లమెంట్ ముందుకు రాకుండానే, పార్లమెంట్ సమీక్షించకుండానే అమల్లోకి తెచ్చింది. ప్రభుత్వ సమాచారం ఫేక్ అని 'ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో' గుర్తిస్తే, ఇక దానిని మీడియా సంస్థలు ప్రసారం చేయరాదంటూ కేంద్ర సమాచార, ఎలక్ట్రానిక్, టెలికమ్యూనికేషన్ శాఖ హడావిడి చేస్తోంది ఈ వ్యవహారంపై దేశంలోని పలు మీడియా సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ముసాయిదా బిల్లులోని వివాదాస్పద అంశాల్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశాయి.

ఆదివాసీల జీవనం వైవిధ్యమైనది

మన్ కీ బాత్‌లో ప్రధాని

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆదివాసీలు, గిరిజనుల జీవనం నగర ప్రజల జీవనం కంటే చాలా వైవిధ్యమైనదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈ ఏడాది మన్ కీ బాత్ తొలి ఎపిషోడ్‌లో ఆయన ఆదివారం ప్రసంగించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది 'పద్మ' పురస్కారాలు అందుకున్నవారిలో గిరిజనులు, వారితో మమేకమైన సామాజిక సేవా కార్యాకర్తలు గణనీయమైన సంఖ్యలో ఉండటం పట్ల మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఆదివాసీ, గిరిజన జీవనం అనేక సవాళ్లతో కూడుకొని ఉంటుందని, అయినా తమ సంద్రపాయాలను పరిరక్షించుకోవడానికి వారెంతగానో పరితపిస్తుంటారని ఆయన కొనియాడారు. మోడీ తన ప్రసంగంలో తెలుగువారి ప్రస్తావన కూడా చేశారు. చిరుధాన్యాల పరిశ్రమ నడుపుతున నంద్యాలకు చెందిన కెవి రామసుబ్బారెడ్డి, తెలంగాణకు చెందిన ఇంజినీరు విజయ్ గురించి మోడీ ప్రస్తావించారు. చిరు ధాన్యాల కోసం తన ఉద్యోగాన్ని సైతం వదిలేసి కెవి రామసుబ్బారెడ్డి పరిశ్రమ స్థాపించడం, చిరుధాన్యాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడం ఆదర్శనీయమని మోడీ పేర్కొన్నారు.

ఎన్నికల వేళ 'పద్దు' ఎలా?

కేబినెట్ భేటీలో మంతనాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర మంత్రులతో ఆదివారం కీలక భేటీ నిర్వహించారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో కీలక శాఖలకు సంబంధించిన కేటాయింపులు, బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ నెల 31న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరగనున్న సంగతి తెలిసిందే. కేంద్ర బడ్జెట్ 2023-24ను ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందుకు మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్ కూడా ఇదే.

పునర్వ్యవస్థీకరణపైనా చర్చ !

కేంద్ర మంత్రివర్గంలో భారీ మార్పులకు కసరత్తు జరుగుతోందన్న కథనాల నేపథ్యంలో మోడీ కేంద్ర మంత్రులతో సమావేశమవ్వడం అనేక చర్చలకు తెర లేపింది. కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాల నేతలకు కేబినెట్ పదవులు కట్టబెడితే ఎన్నికల్లో ప్రభావితం చేయవచ్చునన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో నాలుగు ప్రధాన శాఖలు మినహా కేబినెట్ మొత్తాన్ని పునర్వ్యవస్థీకరించే అవకాశముందని వినిపిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ నుంచి ప్రస్తుతమున్న కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డిని కొనసాగిస్తూనే మరొకరికి అవకాశమివ్వాలని బిజెపి అధినాయకత్వం యోచిస్తోందని సమాచారం. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన లక్షణ్ ఈ రేసులో ముందుండగా, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు తీసుకొంటే ఎలా ఉంటుందనే చర్చ కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ప్రసవాలు ఆందోళనకరం

- కొన్ని ఉత్తర భారత రాష్ట్రాలు, ఈశాన్యంలో ఇంటి వద్ద డెలివరీలు
- వీటిలో అధికం పాలిత రాష్ట్రాలే
- జాతీయ సగటు కంటే అధికం
- కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సమాచారం
- ఆందోళన కలిగిస్తున్న పరిస్థితులు : నిపుణులు

న్యూఢిల్లీ : దేశంలో ప్రసవాలు కొన్ని రాష్ట్రాల్లో సాఫీగా ఉంటే.. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మాత్రం ఆందోళనకరంగా మారాయి. దేశవ్యాప్తంగా 2021-22 ఏడాదికి గానూ అనేక రాష్ట్రాల్లో సంస్థాగత ప్రసవాలు (ఆస్పత్రులలో జరిగే డెలివరీలు-ఇన్‌స్టిట్యూషనల్ డెలీవరీలు) పెరుగుదలను నమోదు చేశాయి. కానీ, బిజెపి పాలిత రాష్ట్రాల్లో మాత్రం ఈ పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఈశాన్యంతో పాటు ఉత్తర భారత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీలో ఇప్పటికీ ఇంటి వద్ద ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ సంఖ్య జాతీయ సగటు కంటే ఎక్కువగానే ఉండటం గమనార్హం. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సమాచారంలో ఈ విషయం వెల్లడైంది. దీనిపై ఆరోగ్య నిపుణులు సైతం

ఆందోళనను వ్యక్తం చేశారు.

ఈ సమాచారం ప్రకారం.. తెలంగాణ, తమిళనాడు, గోవాలతో పాటు రెండు కేంద్రపాలిత ప్రాంతాలు పుదుచ్చేరి, లక్షద్వీప్ లు వంద శాతం సంస్థాగత డెలివరీలను నమోదు చేశాయి. కేరళ, ఆంధ్రప్రదేశ్, సిక్కిం, పంజాబ్‌తో సహ తొమ్మిది రాష్ట్రాలలో జననాలు ఆస్పత్రుల్లోనే నమోదయ్యాయి. సంస్థాగత డెలివరీలలో జాతీయ సగటు 95.5 శాతంగా ఉన్నది.

ఇక మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, బీహార్, ఉత్తరాఖండ్, మిజోరాం, అసోం, ఉత్తరప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, త్రిపుర, జమ్మూకాశ్మీర్, ఢిల్లీ వంటి 13 రాష్ట్రాలలో ఇంటి వద్ద జరిగే ప్రసవాలు జాతీయ సగటు కంటే ఎక్కువగా నమోదు చేయడం ఆందోళనను కలిగిస్తున్నది. వీటిలో చాలా వరకూ బిజెపి పాలిత రాష్ట్రాలే కావడం గమనార్హం. ఇంటి వద్ద జరిగే ప్రసవాల జాతీయ సగటు 4.5 శాతంగా ఉన్నది.

ఇంటి వద్ద జరిగే ప్రసవాలు అత్యధికంగా మేఘాలయలో 42.8 శాతంగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో నాగాలాండ్ (21.7 శాతం), మణిపూర్ (19.4 శాతం), బీహార్ (13.3 శాతం), ఉత్తరాఖండ్ (11.5 శాతం), మిజోరాం (12.8 శాతం), అసోం (8.7 శాతం), హిమాచల్‌ప్రదేశ్ (7.3 శాతం), త్రిపుర (5.4 శాతం), జమ్మూకాశ్మీర్ (5.1 శాతం), ఢిల్లీ (4.7 శాతం) లు ఉన్నాయి. 2020-21 ఏడాదికి గానూ భారత్‌లో మొత్తం 10,67,470 ప్రసవాలు ఇండ్ల వద్ద జరిగాయి. 2021-22 ఏడాదిలో అది 9,22,637గా ఉన్నది.

ప్రసూతి మరణాల నిష్పత్తి (ఎంఎంఆర్)ను తగ్గించడానికి సంస్థాగత ప్రసవాలు కీలకమని నిపుణులు చెప్పారు. అయితే, మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ ఆస్పత్రి సదుపాయాలు లేకపోవడం కారణంగా ఇంటి వద్ద ప్రసవాలు ఇంకా జరుగుతున్నాయని తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో వైద్య రంగం పేలవంగా ఉన్నదనడానికి సాక్షాత్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెలువరించిన సమాచారమే ప్రత్యక్ష నిదర్శనమని సామాజికవేత్తలు, నిపుణులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులపై వారు ఆందోళనను వ్యక్తం చేశారు. సంస్థాగత డెలివరీలను పెంచి ప్రసూతి మరణాలను నియంత్రించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వారు కోరారు.

నోరు తెరవద్దు.. కాలు కదపద్దు

- బాండ్ పేపర్‌పై సంతకం చేయండి
- సోనమ్ వాంగ్‌చుక్‌కు లడఖ్ యంత్రాంగం హుకుం
- సంతకం చేయనన్న వాంగ్‌చుక్

శ్రీనగర్ : కేంద్రపాలిత ప్రాంతం లడఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చాలనే, పర్వతాలను పరిరక్షించాలనే డిమాండ్‌తో ఐదు రోజుల నిరాహార దీక్షను చేస్తున్న సామాజికవేత్త, విద్యా సంస్కర్త, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్‌ను నియంత్రించడానికి అక్కడి యంత్రాంగం ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగా ఆయనతో బాండ్ పేపర్‌పై సంతకం చేయించాలని చూసింది. గత నెల రోజులుగా లేహ్ లో జరుగుతున్న పరిణామాలపై ఎలాంటి ప్రకటనలూ చేయననీ, బహిరంగ సమావేశాల్లో పాల్గొననని హామీనిస్తూ బాండ్ పేపర్‌పై సంతకం చేయాల్సిందిగా యంత్రాంగం ఆయనకు తెలిపింది.

ఈనెల 26 నుంచి వాంగ్‌చుక్ లేహ్‌లోని ఫియాంగ్‌లో 'పర్యావరణ దీక్ష' లో ఉన్నారు. అక్కడ మైనస్ 20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. అయితే, ఈ తరుణంలో లడఖ్ కేంద్రపాలిత యంత్రాంగం పైన తెలిపిన విధంగా

అండర్‌టేకింగ్‌ను సమర్పించాల్సిందిగా ఆయనను కోరింది. దీనికి సంబంధించిన విషయాన్ని వాంగ్‌చుక్ ట్విట్టర్‌లో షేర్ చేశారు. బాండ్‌కు సంబంధించిన పత్రాలను సైతం పోస్ట్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు, కార్యక్రమాలకు రెచ్చగొట్టవద్దనీ, అది శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనీ, అనుమతినిచ్చిన ప్రాంతంలోనే వారు (వాంగ్‌చుక్) తన దీక్షను కొనసాగించాలని ఆ బాండ్ పేపర్‌లో ఉన్నది. దీనిని ఉల్లంఘిస్తే న్యాయపరమైన చర్యలుంటాయని యంత్రాంగం పేర్కొన్నది. "వారు (యంత్రాంగం) నిన్న, ఈ రోజు నా వద్దకు వచ్చి బాండ్‌పై సంతకం చేయాలన్నారు. నేను మొదటగా నా లాయర్లను కలుస్తానని వారికి చెప్పాను" అని వాంగ్‌చుక్ చెప్పారు. తాను బాండ్‌పై సంతకం చేయనని కూడా తెలిపారు. గొంతులను నొక్కే "బనానా రిపబ్లిక్" వ్యూహంగా దీనిని ఆయన అభివర్ణించారు.

తన పర్యావరణ దీక్ష అనేది అసమ్మతి చర్య కాదనీ.. పర్యావరణానుకూల జీవనశైలిని ప్రోత్సహిస్తున్నాననీ.. పర్వతాలు, హిమానీనదాల రక్షణను తాను కోరుతున్నానని వాంగ్‌చుక్ తెలిపారు. ఐదు రోజుల పర్యావరణ దీక్షను చేపట్టడానికి నిర్ణయించిన ఖర్దూంగ్ లా పాస్ ప్రాంతానికి వెళ్లకుండా నిరోధించడానికి తన ఉద్యమాన్ని పాలక యంత్రాంగం నియంత్రించిందని ఆయన అన్నారు. వారు తనకు వారంట్ జారీ చేయలేదనీ, గృహ నిర్బంధం కంటే దారుణమైన స్థితిలో తాను ఉన్నానని తెలిపారు. 2019, ఆగస్టు 5న జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు సందర్భంగా కాశ్మీర్ ప్రధానస్రవంతి రాజకీయ నాయకులను సంతకాలు చేయాలంటూ ఆదేశించిన బాండ్ పేపర్ లో ఉన్న పదాలే.. ప్రస్తుతం వాంగ్‌చుక్‌కు జారీ చేసిన బాండ్ పేపర్‌లో ఉండటం గమనార్హం.

ఇటు లడఖ్‌లో భూమి, ఉద్యోగాల రక్షణపై చర్చించడానికి కేంద్రం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ లో చర్చల్లో పాల్గొనడానికి ఈ ప్రాంతానికి చెందిన రెండు పెద్ద పౌర సంఘాల నిరాకరించాయి. ప్యానల్ అజెండాలో లడఖ్‌కు రాష్ట్ర హోదా, ఆరో షెడ్యూల్ కింద రాజ్యాంగ పరిరక్షణలు వంటి తమ డిమాండ్లను చేర్చలేదని పౌర సంఘాలు తెలిపాయి.

కర్తవ్య నిర్వహణలో భద్రతా మండలి విఫలం

- ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షులు కస్బా కొరొసి

న్యూయార్క్ : ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అచేతనంగా తయారైందనీ, అది తన ప్రాథమిక కర్తవ్యాన్ని నిర్వహించడంలో విఫలమైందని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షులు కస్బా కొరొసి వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ శాంతి, భద్రతను రక్షించడంలో తన ప్రాథమిక విధిని భద్రతా మండలి నిర్వర్తించలేకపోయిందన్నారు. భద్రతా మండలిని

శక్తివంతంగా తీర్చిదిద్దడానికి దానిని సంస్కరించాలనే డిమాండ్ సభ్యదేశాల నుంచి పెరుగుతోందని చెప్పారు. ఆదివారం ఇక్కడ భారత పర్యటనకు బయలుదేరే ముందు కొరొసి ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆహ్వానం మేరకు దేశంలో మూడు రోజుల పాటు కొరొసి పర్యటించనున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఐరాస సాధారణ అసెంబ్లీ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన తరువాత హంగేరికి చెందిన కొరొసికి ఇదే మొదటి విదేశీ పర్యటన కావడం విశేషం. 'భద్రతా మండలి చాలా సులభమైన కారణంతో తన ప్రాథమిక విధిని నిర్వహించడం లేదు. భద్రతా మండలి వ్యవస్థగా ఉండాలి, కానీ వీటో అధికారం కారణంగా భద్రతా మండలి చర్యలు తీసుకోలేకపోతోంది' అని అన్నారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్య స్థానానికి భారత్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని, ఈ విషయంలో కొన్ని సంవత్సరాల నుంచి చేస్తున్న ప్రయత్నాల్లో భారత్ ముందంజలో ఉందని ఆయన అన్నారు.

గుజరాత్‌లో మళ్లీ లీక్

- జూనియర్ క్లర్క్ పరీక్షా పేపర్ లీక్
- 16 మంది అరెస్టు
- 2017 నుంచీ మూడుసార్లు రద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో, అహ్మదాబాద్

జూనియర్ క్లర్కుల నియామకం కోసం ఆదివారం నిర్వహించాల్సిన పోటీ పరీక్షను గుజరాత్ ప్రభుత్వం రద్దు చేసింది. పరీక్ష మరికొన్ని గంటల్లో ప్రారంభం కానుండగా ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు పోలీసులు గుర్తించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో లక్షలాది మంది అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వరకూ వచ్చి పరీక్ష రాయకుండానే వెనుదిరగాల్సివచ్చింది. 2017 నుంచి ఈ పరీక్షను అక్కడి బిజెపి ప్రభుత్వం రద్దు చేసుకుంటూనేవస్తోంది. 2018, 2019లోనూ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంతోనే ఈ పరీక్షను రద్దు చేసి వాయిదా వేయడం, ఇప్పుడు మళ్లీ అదే కారణంతో రద్దు చేయడం గమనార్హం. బిజెపి ప్రభుత్వానికి పరీక్షలు నిర్వహించడం కూడా చేతకావడం లేదని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

కాగా వడోదర, అహ్మదాబాద్‌లో ఈ పరీక్షకు శిక్షణ ఇచ్చిన ప్రయివేటు శిక్షణా కేంద్రాలు ఒక ముఠాగా ఏర్పడి ప్రశ్నాపత్రాలను లీక్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రశ్నాపత్రాల లీకేజీకి సంబంధించి గుజరాత్ ఉగ్రవాద నిరోధక బృందం (ఎటిఎస్)కు చెందిన ప్రత్యేక బృందం 16 మందిని అరెస్టు చేసింది. గుజరాత్, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో సోదాలు జరిపి మొత్తం 16 మందిని ఈ కేసులో అరెస్టు చేసినట్లు గుజరాత్ ఎటిఎస్ బృందం ఆదివారం సాయంత్రం వెల్లడించింది. వీరిలో ఇద్దరు 2019లో బిట్స్ పిలానీ ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలోనూ అక్రమాలకు పాల్పడిన ఆరోపణలపై గతంలో కేంద్ర దర్యాప్తు బృందం (సిబిఐ)కి పట్టుబడ్డారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1181 జూనియర్ క్లర్కు పోస్టుల నియామకం కోసం ఈ పోటీ పరీక్షను గుజరాత్ పంచాయత్ సర్వీస్ సెలక్షన్ బోర్డు (జిపిఎస్ఎస్‌బి) నిర్వహించాల్సివుంది. పరీక్ష రాసేందుకు 9.5 లక్షల మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. మొత్తం 2995 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష ప్రశ్నాపత్రాలను ముద్రించేందుకు ఎంపిక చేసిన హైదరాబాద్‌లోని ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్న ప్రదీప్ నాయక్ ప్రస్తుత లీకేజీలో సూత్రదారిగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. ఇతనితో పాటు గుజరాత్‌లోని వివిధ కోచింగ్ సెంటర్లలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన ఏడుగురిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. జూనియర్ క్లర్కుల నియామకం కోసం నిర్వహించే పరీక్ష ..ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా రద్దు కావడం 2017 నుంచి ఇది మూడో సారి. గతంలో 2018లోనూ, 2019లోనూ రద్దు అయ్యింది. ప్రశ్నాపత్రాల లీకేజీపై కాంగ్రెస్, ఆమాద్మీ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. యువత భవిష్యత్‌తో బిజెపి రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుతోందని తీవ్రంగా విమర్శించారు. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగం ఎంత అసమర్థనీయంగా ఉందో చెప్పడానికి ఇది ఉదాహరణ అని, 2017 నుంచీ ఈ పరీక్షను నిర్వహించలేకపోతోందంటే బిజెపి పాలన ఎంతటి అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనిష్ దోషి అన్నారు. గుజరాత్‌లో ప్రతి పరీక్షకూ ప్రశ్నాపత్రం లీక్ అవడానికి కారణమేంటని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు. రాష్ట్ర యువత భవిష్యత్తును బిజెపి ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆయన ట్వీట్ చేశారు.

పాక్‌లో ఘోర ప్రమాదం

- బ్రిడ్జిపై నుంచి పడి దగ్ధమైన బస్సు
- 41 మంది మృతి

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ రాష్ట్రంలో ఆదివారం ఘోర ప్రమాదం సంభవించింది. అదుపు తప్పిన బస్సు బ్రిడ్జిపై నుంచి కిందకు పడి అగ్నికి ఆహుతైన ప్రమాదంలో 41 మంది మరణించారు. వంతెనపైకి దూసుకెళ్లిన బస్సు, అక్కడి నుంచి అదుపు తప్పి లోయలో పడిపోవడంతో మంటలు అంటుకున్నాయని బలోచిస్థాన్‌లోని లాస్బెలా జిల్లాకు చెందిన అసిస్టెంట్ కమిషనర్ హంజా అంజుమ్ మీడియాకు వెల్లడించారు. ఈ బస్సు బలోచిస్తాన్ రాజధాని క్వెట్టా నుంచి కరాచీకి వెళుతుండగా లాస్బెలాకు సమీపంలో ప్రమాదానికి గురయింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 48 మంది ప్రయాణీకులు ఉండగా, ఇందులో 41 మంది మరణించారని అధికారులు తెలిపారు. గాయపడిన వారి ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

పడవ బోల్తా .. 10 మంది విద్యార్థులు మృతి

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుతుంఖ్వా రాష్ట్రంలో ఒక పడవ బోల్తా పడిన దుర్ఘటనలో 10 మంది విద్యార్థులు చనిపోయారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా ఏడు నుంచి 14 ఏళ్ల వయస్సు ఉన్నవారే. రాష్ట్రంలోని కోహట్ జిల్లాలోని తాండా డ్యామ్ సరస్సులో ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. సమీపంలోని మిర్బాష్ ఖేల్ మదర్సాకు చెందిన విద్యార్థులు విహార యాత్రలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో పడవలో 30 ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సర్కార్ బడికి చలోచలో

- కోవిడ్ తర్వాత గ్రామీణ భారత్‌లో మారిన పరిస్థితులు

న్యూఢిల్లీ : భారత్‌లో కరోనా మహమ్మారి రాక తర్వాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా గ్రామీణ భారతంలో ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ అనేక మంది చిన్నారులు ప్రయివేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడులకు మారారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇవే పరిస్థితులు కనిపించాయి. 17వ దేశవ్యాప్త వార్షిక విద్యాస్థితి (ఎఎస్ఈఆర్) నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. దేశవ్యాప్తంగా 616 జిల్లాల్లోని దాదాపు ఏడు లక్షల మంది చిన్నారులను కవర్ చేస్తూ ఈ నివేదికను రూపొందించారు. ఈ సర్వేను ప్రథమ్ ఎన్జీవో నిర్వహించింది. కోవిడ్ నేపథ్యంతో ఉపాధి కోల్పోవడం, ఆదాయాలు తగ్గిపోవడం మరోవైపు డిజిటలైజేషన్ పేరిట ప్రయివేటు విద్యా సంస్థలు భారీగా ఫీజులు వడ్డిస్తుండటంతో గ్రామీణ ప్రజానీకం తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్లను మాన్పించి ..సర్కార్ పాఠశాలలకు పంపిస్తున్నారు. 'ప్రథమ్' నివేదిక సమాచారం ప్రకారం.. 2018-2022 మధ్యలో దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రయివేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను తీసుకున్న చిన్నారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2018లో ప్రభుత్వ స్కూళ్లలో చేరిన పిల్లల సంఖ్య 65.6 శాతంగా ఉండగా.. 2022లో అది 72.9 శాతానికి పెరిగింది. ఆరు నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న చిన్నారుల్లో 98.4 శాతం మంది ప్రస్తుతం ఒక రకమైన సరైన విద్యలో నమోదు చేయబడ్డారు. మరోపక్క, అన్ని తరగతుల స్కూల్ చిన్నారుల పఠనాశక్తి 2012కు ముందు స్థాయి వరకు పడిపోయాయి. అలాగే కనీస గణిత నైపుణ్యాలు 2018 స్థాయిలకు పడిపోవటం గమనార్హం. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో బాల,బాలికల గైర్హాజరు కనిపించింది. రెండో తరగతి స్థాయి పాఠాలను చదవగలిగే మూడో తరగతి పిల్లల శాతం ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో 2018లో 27.3 శాతం నుంచి 2022లో 20.5 శాతానికి పడిపోయింది. ఈ తగ్గుదల ప్రతి రాష్ట్రంలోనూ కనిపించింది. 2018లో పఠనా స్థాయి అధికంగా ఉన్న రాష్ట్రాలలో అదే ఏడాది నుంచి పది శాతం కంటే ఎక్కువ పాయింట్లు పడిపోయిన రాష్ట్రాల జాబితాలో హిమాచల్ ప్రదేశ్ (47.7 శాతం నుంచి 28.4 శాతం), హర్యానా (46.4 శాతం నుంచి 31.5 శాతం) లు ఉన్నాయి.

మీకోసం

కొబ్బరిచిప్పలు కొన్ని రోజుల పాటు తాజాగా ఉండాలంటే రోజూ నిమ్మరసం రాయాలి.

జీవన సౌరభం

గెలవాలి అనే తపన ఉంటే సరిపోదు. గెలుస్తాను అన్న నమ్మకం కూడా ఉండాలి.

నవ్వాలి .. నవ్వాలి

నవ్వాలి నవ్వాలి
తనివితీర నవ్వాలి
నదినీరు పరవళ్ళు
తొక్కినట్టు నవ్వాలి

పైరుగాలికీ ఊగే
పంటలాగ నవ్వాలి
పొయ్యిమీద పాలకడవ
పొంగినట్టు నవ్వాలి

పూలతీగమీద ఉన్న
పిట్టలాగ నవ్వాలి
పొట్ట చెక్కలయ్యేలా
పకపకా నవ్వాలి

బిడ్డతో ఆడుతున్న
తల్లిలాగ నవ్వాలి
తనువంతా నిండుగా
తన్మయంతో నవ్వాలి

నెమలి పురివిప్పినట్టు
వికసిస్తూ నవ్వాలి
సిరిమల్లె తీగకున్న
పువ్వల్లే నవ్వాలి

- రావిపల్లి వాసుదేవరావు
94417 13136

అవి ఏవీ?



చిన్నారులూ, పై వరుసలో ఉన్న నక్కల్లో ఒకటి, కింది వరుసలో ఉన్న నక్కల్లో మరొకటి ఒకే విధంగా ఉన్నాయి. అవి ఏంటో కనిపెట్టండి.

జవాబు : 2-8

నేను గీసిన బొమ్మ

సహర్షిణి,
7వ తరగతి,
ఇంగ్లీష్ మీడియం జడ్పిహెచ్ఎస్,
హవేలీ, ఘనాపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

తోలుబొమ్మలు తోడుగా ...

పిల్లలు చాలా సున్నిత మనస్కులు. బాల్యంలో వారి లేత మనసులపై ఏది అయితే ముద్ర పడుతుందో అదే నిజం అని నమ్ముతారు. చాలా మంది తమకు ఎదురైన సంఘటనని, హింసను బయటకు చెప్పేందుకు భయపడతారు. కొంతమంది అసలు మాట్లాడరు. మరి కొంతమంది బాగా అల్లరి చేస్తారు. అలాంటి వారి కోసం ఈ తోలుబొమ్మల కథలు వినిపిస్తున్నారు ఓపెన్ హౌస్ టీం సభ్యులు. పిల్లలు నివాసం ఉన్న ప్రతిచోటా ప్రదర్శన రూపంలో చైతన్యవంతమైన కథలను వివరిస్తున్నారు.

చెన్నైకు చెందిన కొంతమంది యువకులు ఏడేళ్ల క్రితం 'ఓపెన్ హౌస్' బృందంగా ఏర్పడ్డారు. దీని ద్వారా పిల్లలకు మైమ్, నాటకం వేయడం నేర్పిస్తున్నారు. ఇతర కళారూపాల ద్వారా కథలు చెప్పడం, రాయడం, తోలుబొమ్మల తయారీ వాటిపై వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. ఇది ఎవరైనా చేరగల కళాత్మక సంఘం. వివిధ కళల్లో అనుభవం ఉన్న విద్యార్థులంతా కలిసి ఈ కార్యక్రమాలు నిర్వహించడం చూసి, పలువురు తల్లిదండ్రులు వారిని అభినందిస్తున్నారు.

ఓపెన్ హౌస్‌లో దీపక్, అయ్యప్పన్, యువీ, కాశ్వన్, అబ్బాస్, కార్తీక్, యువశ్రీ, కళ ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు. ఇందులో ముగ్గురు, నలుగురు తెర వెనుక తోలుబొమ్మలను కదిలిస్తూ ఉంటారు. ఒకరు కథను వివరిస్తాడు. కొన్నిసార్లు కథలో ఎక్కువ పాత్రలు ఉన్నప్పుడు మిగిలిన సభ్యులూ పాల్గొంటారు. ఈ ప్రదర్శనలకు ఎటువంటి డబ్బు ఆశించకుండా నగరంలో అన్ని పాఠశాలలకు తిరుగుతున్నారు. పిల్లల కోసం వీరు చేస్తున్న ప్రయత్నాన్ని గుర్తించి కొంతమంది దాతలు వీరికి ప్రయాణపు ఖర్చులు, ఆహార సదుపాయం కల్పిస్తున్నారు.

పూర్వం పరిపాలకులుగా ఉన్న పాండ్యులు, చోళల చారిత్రక గాధలను తోలుబొమ్మల ద్వారా పిల్లలకు చెబుతున్నారు. పిల్లలు ఎంతో శ్రద్ధతో బొమ్మలను చూస్తూ ఆ కథలను వింటున్నారు. రెండు రోజుల పాటు వినిపించే ఈ నాటకాన్ని తోలుబొమ్మల ద్వారా గంటలో షాట్ చేసి చూపిస్తున్నారు. 'పిల్లలలో జీవన నైపుణ్యాలను పెంపొందించడం, ప్రశ్నించేతత్వాన్ని పెంచటం, స్కిట్‌లు వేయించడం, కథలు చెప్పడం ద్వారా

పిల్లల్లో తమపై తమకు నమ్మకం ఏర్పడుతుంది. భావ వ్యక్తీకరణ పెరుగుతుంది. పిల్లల భావాలను మనం అర్థం చేసుకున్నప్పుడే వారు మనతో మనసువిప్పి మాట్లాడతారు' అని సభ్యుల్లో ఒకరైన సీత అంటోంది.

ఈ సభ్యులు ప్రతి ఆదివారం ఏదో ఒక స్కూల్లో, పిల్లలు ఉన్న ప్రాంతాన్ని ఎంచుకుని తమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరి ఇచ్చిన శిక్షణ ఆలంబనగా మేదవాక్కం ప్రాంతానికి చెందిన కొంతమంది పిల్లలు స్వయంగా కథలు చెబుతున్నారు. కథకు తగ్గట్టుగా తోలుబొమ్మలు తయారుచేస్తున్నారు. స్వయంగా నాటికలూ రాస్తున్నారు.

ప్రయివేటు స్కూల్లో కొన్ని వారాల పాటు నిర్వహించిన తోలుబొమ్మల ప్రదర్శన తర్వాత పిల్లల అభిప్రాయాలు తెలుసుకున్నారు. నేర్చుకోవటానికి తాము చాలా సంబరపడుతున్నామని పిల్లలు చెప్పారు. ఇంటికి వెళ్లి ఆ కథల గురించి అమ్మానాన్నలతో చర్చిస్తున్నామని చెప్పారు. ఈ శిక్షణ తరువాత పిల్లలు క్లాసు రూంలో చురుకుగా ఉంటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

శానిటరీ ప్యాడ్స్‌తోనూ సమస్యలు

మహిళలు గతంలో రుతుస్రావం సమయంలో ఇంట్లోని పాత వస్త్రాలను వినియోగించేవారు. తర్వాత కాలంలో శానిటరీ ప్యాడ్స్ అందుబాటులోకి వచ్చాయి. వీటివల్ల సౌలభ్యం కొంత పెరిగినా .. వాటి తయారీలో పాటిస్తున్న పద్ధతులు కొన్ని కొత్త సమస్యలను తెస్తున్నాయి. ప్యాడ్‌లకు మదుత్వం, పీల్చుకునే గుణం పెంచటానికి సింథటిక్ ప్లాస్టిక్ పదార్థాలను వినియోగిస్తున్నారు. ఇది చాలా హానికరమని, దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి వ్యాధులకు గురయ్యే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అన్ని రకాల శానిటరీ ప్యాడ్ల తయారీలోనూ థాలేట్స్, అస్థిర కర్బన సమ్మేళనాలు వంటి హానికర రసాయనాలు వాడుతున్నారు. ఫ్లెక్సిబిలిటీ, పారదర్శకత, ఎక్కువ మన్నిక కోసం థాలేట్స్‌ను కలుపుతున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ (ఎన్‌సీబీఐ) ప్రకారం.. థాలేట్స్ అనేది యుక్త వయస్సులో శరీరంలో మార్పులను ప్రేరేపిస్తుంది. క్యాన్సర్, సంతానోత్పత్తి లోపాలకు కారణం అవుతుంది. టెస్టిక్యులర్ డిస్జెనిసిస్ సిండ్రోమ్‌కు దారితీస్తుంది. ఇంకా ఈ రసాయనాలు అండాశయ, రొమ్ము క్యాన్సర్లకు కారణమవుతున్నాయని నిపుణులు తేల్చారు. ఈస్ట్రోజెన్ వంటి స్త్రీ హార్మోన్లను ప్రభావితం చేస్తాయని, అది క్రమరహిత ఋతుస్రావానికి దారి తీయొచ్చని కూడా అంటున్నారు.

పరీక్షల్లో నిర్ధారణ

ప్రముఖ బ్రాండ్ శానిటరీ ప్యాడ్లలో విషపూరితమైన స్టైరిన్, క్లోరోఫామ్, క్లోరోమీథేన్ సమ్మేళనాలు అధిక మొత్తంలో ఉన్నట్లు 2014లో విమెన్స్ వాయిస్ ఫర్ ఎర్త్ గ్రూప్ నివేదించింది. 2017లో ఒక దక్షిణ కొరియా అధ్యయన నివేదిక కూడా శానిటరీ ప్యాడ్లలో వీఓసీల అధిక స్థాయిల్లో ఉన్నట్లు హెచ్చరించింది. సదరు కంపెనీపై మహిళా సంఘం దావా కూడా వేసింది. అయితే, నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేషన్ సర్వే (ఎన్‌హెచ్‌ఏఎన్‌ఈఎస్) 2001-04 డాటాను ఉపయోగించి అధ్యయనం జరిపింది. దీని ప్రకారం 20- 49 ఏళ్ల వయస్సు మధ్య గల మహిళల్లో యోని డౌచింగ్ ఫ్రీక్వెన్సీ 1, 4 -డైక్లోరోబెంజీన్ రక్త సాంద్రతల మధ్య సానుకూల సహ సంబంధాన్ని నివేదించింది. దాంతో ఈ ప్రత్యేక సమ్మేళనం క్యాన్సర్లకు కారణమవుతుందని పరిశోధకులు తేల్చారు.

సురక్షితంగా వాడాలి

పెరినియల్ ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం లేకుండా అవసరమైనంత నీరు తాగుతూ ఉండాలి. పెరినియల్ పరిశుభ్రతను పాటించాలి. సువాసనలతో కూడిన ప్యాడ్‌లను వాడకుండా చూసుకోవాలి. రేపర్లపై కోట్ చేసే సేంద్రియ వంటి పదాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. దురద, ఎరుపు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

వృత్తి కథలతో కొత్త బలం

ఏ సినిమా తీసుకున్నా కథానాయకుడి చేసే పని ఆధారంగా కథ నడుస్తుంది. ఆయన వృత్తిలో ఉన్న కష్టాలు, దాన్ని చుట్టూ అల్లుకున్న పాత్రలు, అందులో ఘర్షణలు, లోతుపాతులతో తెరకెక్కిస్తారు దర్శకులు. ఈ తరహాలో వచ్చిన సినిమాలు హీరోలను ప్రజలకు దగ్గర చేస్తాయి. 'మా వృత్తిదారునిగా హీరో నటించారు' అనుకుంటారు. పాత సినిమాల్లో ఎక్కువగా వృత్తే ఇతివృత్తంగా రూపొందించినవి ఎక్కువగా ఉన్నాయి. దాంతో సామాజిక అంశాలు ప్రేక్షకులకు అర్థమవుతాయి. ఇటువంటి సినిమాల ద్వారా సమాజంలో అసమానతలు అవగతం చేసుకోవడం ప్రజలకు సులభం అవుతుంది. ఈ క్రమంలో వృత్తికి తగ్గట్టుగా హీరో వేషధారణ, భాష, హావభావాలూ పూర్తిగా మార్పు ఉంటుంది. అదే ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

చిరంజీవి తాజా చిత్రం 'వాల్తేరు వీరయ్య'లో ఆయన సముద్రంలో చేపలు పట్టుకునే గంగపుత్రుడు (వేటగాడు) పాత్రలో కనిపించాడు. జాలరిపేటలో పెద్ద దిక్కుగా, తోటి వేటగాళ్లకు అండగా ఉండే వ్యక్తిగా చూపించడం కథకే ప్రాణం. చిరంజీవి ఇటువంటి వృత్తి నేపథ్యం పాత్రలో కనిపించడం కొత్తమీ కాదు. గతంలో 'ముఠామేస్త్రి' సినిమాలో ముఠా కార్మికుడుగా కనిపించాడు. అందులో కాయకష్టం తెలిసిన వ్యక్తిగా యార్డు కోసం పోరాటం చేసే నాయకుడుగా కనిపించి కార్మికుల హృదయాల్లో గొప్ప హీరోగా నిలిచిపోయాడు. 'రిక్షావోడు' చిత్రంలో రిక్షావోడుగా, ఆపద్బాంధవుడులో గోవులు కాసే గోపాలుడిగా, స్వయంకృషిలో చెప్పులు కుట్టే వ్యక్తిగా నటించారు. అవన్నీ మంచి ఆదరణ పొందాయి.

పాత చిత్రాల్లో హీరోలైనా ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, కృష్ణంరాజు రైతులుగా, వ్యవసాయ కూలీలుగా, బడుగుబలహీన వర్గాల్లో ఉన్న సమస్యలను వెలిబుచ్చే వృత్తిదారుల పాత్రల్లో నటించారు. అందుకే ఇప్పటికీ తెలుగు ప్రజల్లో హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు.



హీరో వెంకటేష్ 'కూలి నెం-1' చిత్రంలో రైల్వే కూలీగా నటించారు. దాంతో ఆ కూలీల పని, వారి కుటుంబాల స్థితిగతులు ఎలా ఉంటుందో సన్నివేశాల్లో చూపించారు. 'కొండపల్లి రాజా'లో పశు పోషకుడుగా, 'ధర్మక్షేత్రం' చిత్రంలో ఆవేశం ఉన్న లాయర్‌గా, 'గణేష్'లో రాజకీయ నాయకుల అవినీతిని ప్రశ్నించే జర్నలిస్టుగా కనిపించారు. వృత్తిలో నిజాయితీగా ఉంటే ఎటువంటి పరిణామాలు ఎదుర్కోవాలో కూడా చూపించారు. అప్పట్లో ఈ సినిమా మీడియా ప్రతినిధులకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. శ్రీకాంత్ హీరోగా నటించిన 'మాణిక్యం' సినిమాలో కుమ్మరిగా నటించారు. ఈ కుటుంబంలో ఓ ఆడపిల్ల పెళ్లి చేయడానికి ఎంత కష్టపడాలో చూపించిన సన్నివేశాలు ప్రతి ఒక్కరినీ కన్నీరు పెట్టిస్తాయి. ఈ సినిమాలో చేనేత కార్మికుల గాథలు ఎంతో హృద్యంగా ఉంటాయి. నాగార్జున నటించిన 'ప్రెసిడెంట్ గారి పెళ్లాం' చిత్రంలో సాగు విలువ తెలిసిన రైతుగా కనిపించారు. కూలీలు, ప్రజల క్షేమం కోసం నిలబడే వ్యక్తిగా చూపించారు. 'లారీ డ్రైవర్' చిత్రంలో బాలకృష్ణ హీరోగా నటించారు. ఓ లారీడ్రైవర్‌గా బాధ్యతలు, సమస్యలను స్పష్టంగా చూపించారు.

ఈ తరహా సినిమాలు ఇప్పుడు ఎక్కువగా రావడం లేదు. కొత్తగా వస్తున్న సినిమాల్లో హీరోలు, హీరోయిన్లను ఎక్కువగా సాఫ్ట్‌వేర్లుగా, డాక్టర్లగా, వెడ్డింగ్ ప్లానెర్స్‌గా, క్రియేటివ్ హెడ్స్‌గా, లాయర్స్, పోలీస్ ఆఫీసర్స్‌గా కనిపిస్తున్నారు. మూడేళ్ల క్రితం క్రిష్ దర్శకత్వంలో 'కొండపొలం' తీశారు. ఇందులో గొర్రెల కాపలాదారు జీవులను బతికించుకునేందుకు పడే దుస్థితిని కళ్లకు కట్టినట్టు చూపించారు. 'ఉప్పెన' చిత్రంలో మత్స్యకారుడిగా వైష్ణవ్ తేజ్‌ను హీరోను పరిచయం చేశారు. ఇదే సినిమా విజయానికి కారణమూ అయ్యింది. వివిధ వృత్తి సమస్యలపై సినిమాలు ఫోకస్ చేస్తే.. అవి ప్రజల్లో చర్చకు, కథను బట్టి ఆదరణకూ నోచుకుంటాయి.

హాకీ ప్రపంచ విజేత జర్మనీ

- ఫైనల్లో బెల్జియంపై గెలుపు

భువనేశ్వర్: హాకీ పురుషుల ప్రపంచకప్ 2023 టైటిల్‌ను జర్మనీ గెలుచుకుంది. భువనేశ్వర్‌లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ బెల్జియంపై జర్మనీ పెనాల్టీ షూటౌట్‌లో 5-4 తేడాతో ఘన విజయం సాధించింది. ప్రపంచకప్ కోసం చివరి నిమిషం వరకు ఇరు జట్లు హోరాహోరీ తలపడ్డాయి. అసాధారణ ఆట తీరుతో జర్మనీ ప్రపంచకప్ విజేతగా నిలిచింది. ఫైనల్లో తొలి క్వార్టర్‌లో బెల్జియం ఆటగాళ్లు వాన్ అయిబెల్, టాంగీ కోసిన్స్ చెరో గోల్ చేసి జర్మనీపై ఒత్తిడి పెంచారు. రెండో క్వార్టర్‌లో జర్మనీ ఆటగాడు నిక్లస్ వెల్లెన్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. మూడో క్వార్టర్‌లో జర్మనీ మరో గోల్ సాధించడంతో ఇరు జట్లు చెరో రెండు పాయింట్లు సాధించాయి. నాలుగో క్వార్టర్ ప్రారంభమైన మూడో నిమిషంలో జర్మనీ ఆటగాడు మాట్స్ గ్రాంబుష్ గోల్ చేసి డిఫెండర్ బెల్జియంపై ఒత్తిడి పెంచారు. చివరి నిమిషంలో బెల్జియంకు లభించిన పెనాల్టి కార్నర్‌ను గోల్‌గా మలచడంతో ఇరు జట్ల స్కోర్లు 3-3తో సమయ్యాయి. దీంతో విజేతను నిర్ణయించడం కోసం పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. ఇందులో బెల్జియం నాలుగు గోల్స్ చేయగా, జర్మనీ ఐదు గోల్స్ సాధించింది. ఈ విజయంతో జర్మనీ ప్రపంచకప్‌ను గెలుచుకుంది. ఇది జర్మనీకి పురుషుల హాకీలో మూడో ప్రపంచకప్ కావడం విశేషం.

జకో ఖాతాలో ఆస్ట్రేలియా ఓపెన్

- కెరీర్‌లో పదో టైటిల్
- నాదెల్ గ్రాండ్‌శ్లామ్ రికార్డు సమం

మెల్‌బోర్న్ : ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌ను సెర్బియా ఆటగాడు నొవాక్ జకోవిచ్ సొంతం చేసుకున్నాడు. ఈ టైటిల్‌ను సాధించడం జకోవిచ్ కెరీర్‌లో పదోసారి కాగా, తన కెరీర్‌లో 22వ గ్రాండ్‌స్లామ్‌ను సొంతం చేసుకొన్నాడు. ఆదివారం ఫైనల్‌లో సిట్సిపాస్‌పై అద్భుత విజయంతో టైటిల్‌ను దక్కించుకున్నాడు. హోరాహోరీగా సాగిన తుది పోరులో 6-3, 7-6, 7-6 తేడాతో సిట్సిపాస్‌పై జకోవిచ్ గెలుపొందాడు. నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన జకోవిచ్ ఈ టోర్నీ ఆద్యంతం తన ఫామ్‌ను కొనసాగించాడు. ఫైనల్‌లోనూ తొలి సెట్‌ను సులువుగానే సొంతం చేసుకొన్న జకో.. రెండు, మూడు సెట్లలో మాత్రం సిట్సిపాస్ నుంచి ప్రతిఘటన తప్పలేదు. చివరి రెండు సెట్లూ టై బ్రేక్ గేమ్‌లకు వెళ్లడం విశేషం. కరోనా వ్యాక్సిన్ వివాదం కారణంగా గత ఏడాది ఆస్ట్రేలియాకు వెళ్లి మరీ టోర్నీలో ఆడకుండా జకోవిచ్ వెనుదిరిగిన సంగతి తెలిసిందే. తాజా విజయంతో కెరీర్‌లో 22వ గ్రాండ్‌స్లామ్‌ను కైవసం చేసుకొని రఫెల్ నాదల్ (22)తో సమంగా నిలిచాడు.

ఒక్క బంతి తేడాతో.. గెలిచిన భారత్

- ఉత్కంఠగా రెండో టీ20
- కివీస్‌తో సిరీస్ సమం

లక్నో : ఆదివారం భారత్-న్యూజిలాండ్ క్రికెట్ జట్ల మధ్య జరిగిన రెండో టీ20 మ్యాచ్ అత్యంత ఉత్కంఠతో సాగింది. చివరికి ఒక్క బంతి మిగిలి ఉండగా, ఆరు వికెట్ల తేడాతో గెలిచిన భారత్ జట్టు ఊపిరి పీల్చుకుంది. సిరీస్‌ను 1-1తో సమం చేసింది. 100 పరుగుల స్వల్ప లక్ష్య ఛేధనలో భారత జట్టు చివరి ఓవర్ వరకూ శ్రమించాల్సి వచ్చింది. చివరి ఓవర్‌లో విజయం కోసం ఆరు బంతుల్లో ఆరు పరుగులు చేయాల్సిన పరిస్థితి. తొలి బంతికి ఒక పరుగు వచ్చినా రెండో బంతికి పరుగు రాలేదు. మూడు, నాలుగో బంతికి ఒక్కొక్క పరుగు వచ్చింది. ఐదో బంతికి సూర్య కుమార్ ఫోర్ కొట్టడంతో విజయాన్ని అందుకుంది. 26 పరుగులతో సూర్య కుమార్, 15 పరుగులతో హర్ధిక్ పాండ్య నాటౌట్‌గా నిలిచారు. ఓపెనర్లు శుభమ్ గిల్ 11, ఇషాన్ కిషన్ 19 పరుగులు చేయగా, రాహుల్ త్రిపాఠి 13, వాషింగ్టన్ సుందర్ 10 పరుగులు చేశారు. ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కివీస్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. మూడో టీ 20 ఫిబ్రవరి 1న అహ్మదాబాద్‌లో జరగనుంది.

చెన్నుపాటి లక్ష్మయ్య ఫ్లవర్స్ ప్లాంట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు (ఇన్‌సెట్‌లో మొక్క)

ఆ మొక్కకు చెన్నుపాటి పేరు

ప్రజాశక్తి- మండపేట (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా)

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాతల్లో అగ్రశ్రేణి నాయకుడు చెన్నుపాటి లక్ష్మయ్య పేరును ఓ విదేశీ పూల మొక్కకు యుటిఎఫ్ నామకరణం చేసింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో అరుణ వర్ణం ఆకులతో ఉన్న విదేశీ 'పోయిన్‌సెట్టియా రెడ్ మొక్క'కు చెన్నుపాటి లక్ష్మయ్య ఫ్లవర్స్ ప్లాంట్ అనే పేరుపెట్టి ఆవిష్కరించారు. ఈ మొక్కకు ఇంతవరకు స్థానికంగా పేరు లేకపోవడంతో ఇకపై చెన్నుపాటి పేరుతో పిలవాలని నిర్ణయించారు.

పోయిన్‌సెట్టియా మొక్క ఇండోర్ ప్లాంట్‌గా పెంచుకుంటున్నారు. దీనికి పూలు ఉండవు. ఆకులే ఎరుపు రంగులోకి మారడం దీని విశిష్టత. ఇవి అరుణ పతాకాలులాగ రెపరెపలాడతాయి. యుటిఎఫ్ ఉద్యమ పతాకాన్ని గుర్తు తెచ్చేలా ఈ ఆకులు ఉండటంతో ఈ మొక్కకు యుటిఎఫ్ వ్యవస్థాపక చెన్నుపాటి పేరు పెట్టారు. నిజాయితీకి చిహ్నంగా ఈ మొక్కను భావిస్తారు. మొక్క పాలను కొన్ని ఔషధాల్లోనూ వినియోగిస్తుంటారు. ఇటీవల ఈ మొక్కలను కడియం నర్సరీలకు రప్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు రాఘవులు, ప్రభాకర్‌వర్మ, జాతీయ పర్యావరణ మిత్ర, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చిలుకూరి శ్రీనివాసరావు, యుటిఎఫ్ ప్రతినిధులు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతిబసు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68